# ప్రజాశక్తి

మంగళవారం 23 మే 2023

8 పేజీలు

విశాఖపట్నం

అనకాపల్లి

# కదంతొక్కిన ఎల్ఐసి ఏజెంట్లు

◆ విశాఖలో ఘనంగా ఎల్ఐసి ఎఒఐ ఆరో జాతీయ మహాసభ ప్రారంభం

◆ భారీ ర్యాలీ, బహిరంగ సభ

◆ అల్లూరి స్ఫూర్తితో ప్రైవేటీకరణపై తిరుగుబాటుకు సిద్ధంకావాలని నేతల పిలుపు

బహిరంగ సభ వేదిక నుంచి అభివాదం చేస్తున్న నాయకులు

**ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో, కలెక్టరేట్** ప్రభుత్వ రంగ పరిశ్రమలకూ, పోరాడే శక్తులకూ ప్రధాన కేంద్రంగా పేరొందిన విశాఖ నగరంలో అత్యంత ఉత్సాహపూరిత వాతావరణంలో సోమవారం ఎల్ఐసి ఏజెంట్స్ ఆర్గనైజేషన్ ఆఫ్ ఇండియా ఆరో జాతీయ మహాసభలు ప్రారంభమయ్యాయి. రెండు రోజులపాటు జరిగే ఈ మహాసభకు వివిధ రాష్ట్రాల నుంచి ప్రతినిధులు తరలివచ్చారు. తొలుత ఎల్ఐసిలో ఏజెంట్ల వ్యవస్థకు హాని తలపెట్టే చర్యలను కేంద్ర ప్రభుత్వం తక్షణం విరమించాలని డిమాండ్ చేస్తూ భారీ ప్రదర్శన చేపట్టారు. ర్యాలీ ఎల్ఐసి ప్రధాన కార్యాలయం నుంచి వందలాది మందితో ఆర్టీసీ కాంప్లెక్స్, సెంట్రల్ పార్క్ మీదుగా జివిఎంసి గాంధీ విగ్రహం వరకూ సాగింది. అక్కడ బహిరంగ సభ జరిగింది. ప్రదర్శనకు ఎల్ఐసి ఎఒఐ జాతీయ ప్రధాన కార్యదర్శి డాక్టర్ పిజి.దిలీప్, సౌత్ సెంట్రల్ జోన్ అధ్యక్షులు ఎల్.మంజునాథ, ప్రధాన కార్యదర్శి పిఎల్.నరసింహారావు, కోశాధికారి జి.రవికిషోర్, విశాఖపట్నం డివిజన్ ప్రధాన కార్యదర్శి ఎన్ఆర్.ఠాగూర్, అధ్యక్షులు ఎం.నాగరాజు మిగతా 2లో..

నగరంలో భారీ ప్రదర్శన నిర్వహిస్తున్న ఎల్ఐసి ఏజెంట్లు

వినతిపత్రాలు స్వీకరిస్తున్న కలెక్టర్ మల్లికార్జున

## 'జగనన్నకు చెబుదాం' అర్జీలను పరిష్కరించాలి

**ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ :** 'జగనన్నకు చెబుదాం' అర్జీదారుల సంతృప్తి స్థాయి మరింత పెరిగేలా సంబంధిత అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున స్పష్టం చేశారు. సోమవారం ఉదయం జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో 'జగనన్నకు చెబుదాం' కార్యక్రమాన్ని అధికారులతో కలిసి ఆయన నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ స్పందన వినతుల పరిష్కారంలో నాణ్యతా ప్రమాణాలను మెరుగుపరచుకొని పరిష్కరించేందుకు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. పెండింగ్ దరఖాస్తులపై సమీక్షించి సత్వర పరిష్కారానికి చర్యలు చేపట్టాలన్నారు. అనంతరం ప్రజల నుంచి విజ్ఞప్తులు స్వీకరించారు. సోమవారం 'జగనన్నకు చెబుదాం' కార్యక్రమంలో 226 విజ్ఞప్తులు అందాయి. జిల్లా రెవెన్యూ అధికారి ఎస్.శ్రీనివాసమూర్తి, ఆర్‌డిఒ హుస్సేన్ సాహెబ్, పోలీస్, మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.

**జివిఎంసిలో 'స్పందన'కు 78 వినతులు**

**ఎంవిపి.కాలనీ :** జివిఎంసి ప్రధాన కార్యాలయ సమావేశ మందిరంలో సోమవారం జరిగిన స్పందన కార్యక్రమానికి నగర మేయర్ గొలగాని హరివెంకట కుమారి, కమిషనర్ సిఎం.సాయికాంత్ వర్మ హాజరయ్యారు. వారికి 78 ఫిర్యాదులు వచ్చాయి. మూడు రోజులలో పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని వారు అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో మిగతా 2లో..

### వేసవి క్రీడా శిక్షణ శిబిరాలతో ఎంతో మేలు

▶ వార్త 2లో..

### ఆర్‌టిసి విశ్రాంత ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

▶ వార్త 2లో..

### రెగ్యులర్ల పోరాటానికి ఉపాధ్యాయుల మద్దతు

▶ వార్త 8లో..

కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న భీమిలి మండల రైతులతో డాక్టర్ బి.గంగారావు

## గ్రామాల్లో వైసిపి నాయకుల భూదందా

**కలెక్టరేట్ వద్ద ధర్నా చేపట్టిన బాధిత రైతులు**

**ప్రజాశక్తి - కలెక్టరేట్ :** భీమిలి మండలంలోని ఆరు గ్రామాలలో ఏళ్ల తరబడి భూములను సాగు చేసుకుంటున్న రైతులను మోసగించి వారి భూములను స్వాహా చేయడానికి అధికార వైసిపి నాయకులు కుట్రలు చేస్తున్నారని సిపిఎం 78వ వార్డు కార్పొరేటర్ డాక్టర్ బి.గంగారావు అన్నారు. సోమవారం కలెక్టరేట్ ఎదుట బాధిత రైతులతో కలిసి ఆయన ధర్నా నిర్వహించారు. స్పందనలో కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ భీమిలి మండలంలోని మిగతా 2లో..

# ఉపాధి పనులు అరకొరే.. !

**200 రోజులు పని ఇవ్వాలి**

ఏడాదికి రెండు వందల రోజులు పని కల్పించాలి. భూమిలేని మాలోంటళ్లకు ఉపాధి పనులు ఏడాదిపాటు కల్పించినా మంచిదే. వంద రోజులకు మించి పనులివ్వకపోవడంతో ఉపాధి పని అయ్యాక ఇంట్లో వుండిపోతున్నాం. ఒక్కొక్కసారి సిమెంట్ పనులకు వెళ్తున్నాం. మగవాళ్లు తాపీ పనులకు వెళితే, ఆడవాళ్లం చెరువు పనులకు వెళ్తున్నాం.

**అనకాపల్లి అన్నపూర్ణ, గొర్లెవానిపాలెం, పరవాడ మండలం**

◆ పని ప్రదేశంలో దెబ్బతగిలితే ఆకు పసరే దిక్కు

◆ ఎండలోనే కూలీల విశ్రాంతి

◆ వేసవిలో గిట్టని కూలి

◆ నిర్మాణ పనులకు వెళ్తున్న కూలీలు

**దెబ్బతగిలితే సొంత వైద్యమే...**

పనులు చేసినప్పుడు దెబ్బతగిలితే గతంలో ఐడన్ వేసి కట్టు కట్టుకొనేవాళ్లం. ఇపుడావేవీ ఇవ్వడంలేదు. గునపాం, పారదెబ్బ తగిలిన దగ్గర ఆకు పసర నలిపి పెట్టుకుంటున్నాం. లేదంటే ఆస్పత్రికి వెళ్తున్నాం. ఎండాకాలంలో గతంలో ఇచ్చిన అదనపు కూలి ఇవ్వడం ఆపేశారు. మంచినీరుకు డబ్బులు వేయడంలేదు.

**రొంగలి రాము, గొర్లెవానిపాలెం**

**ప్రజాశక్తి-అనకాపల్లి ప్రతినిధి, పరవాడ విలేకరి**

వంద రోజుల పనిదినాలు చాలడంలేదని, పని ప్రదేశంలో గతంలో కల్పించిన సౌకర్యాలేవీ ఇపుడులేవని ఉపాధి హామీ కూలీలు వాపోతున్నారు. కూలీలకు కల్పించే పనిదినాల్లో పరిమితులు విధించడం వల్ల, ఇతర రోజుల్లో పనుల కోసం ఇతర ప్రాంతాలకు వెళ్లాల్సివస్తోందని అనకాపల్లి జిల్లాలోని పరవాడ మండలం గొర్లెవానిపాలెంలోని ఈతచెరువులో మట్టి పనులు చేస్తున్న ఉపాధి కూలీలు అంటున్నారు. వీరే కాదు.. జిల్లాలోని ఉపాధి కూలీలందరూ దాదాపు ఇదే మాట చెబుతున్నారు.

జిల్లాలో దాదాపు 3.53 లక్షల జాబ్‌కార్డులు, 6.27 లక్షల మంది కూలీలు వున్నారు. వీరిలో మూడు లక్షల మందికి అధికారులు పని కల్పించగలిగారు. ఏడాదికి రెండువందల రోజులు పని కల్పించాలని కూలీలు కోరుతుండగా, ప్రభుత్వం సగటున నిర్దేశించిన వంద రోజుల పనిదినాలు కూడా కల్పించలేకపోయింది. తాజాగా సగటున 55 రోజులు పనిదినాలు లభించాయి.

గతంలో గ్రూపుల మిగతా 2లో..

మొదటి పేజీ తరువాయి..

## కదంతొక్కిన ఎల్‌ఐసి ఏజెంట్లు

తదితరులు నాయకత్వం వహించారు. 'సేవ్ ఎల్‌ఐసి... ప్రొటెక్ట్ ఏజెంట్స్, ఐపిఒ పేరుతో ఎల్‌ఐసిని ప్రైవేట్‌పరం చేయవద్దు, కోట్లాదిమంది దేశ ప్రజల ప్రయోజనాల కోసం, దేశ అభివృద్ధి కోసం ఎల్‌ఐసిని యథావిధిగా కొనసాగించాలని పెద్ద పెట్టున నినాదాలు చేశారు.

**18 రాష్ట్రాల నుంచి 500 మంది ప్రతినిధులు**

దేశంలోని 18 రాష్ట్రాల నుంచి సుమారు 500 మంది ప్రతినిధులు (ఎల్‌ఐసి ఏజెంట్లు) ఈ సభలో పాల్గొని తమ తమ అభిప్రాయాలను తెలిపారు. ఇన్సూరెన్స్ రంగంలో 95 శాతం ప్రజలకు క్లెయిమ్‌లు చెల్లించడంలో ఘనత వహించే ఎల్‌ఐసిని కేంద్రంలోని మోడీ ప్రభుత్వం లిస్టింగ్ జాబితాలో పెట్టి కార్పొరేట్లకు కట్టబెట్టే ప్రయత్నాలపై వీరంతా మండిపడ్డారు. దేశంలోని పాలసీదారులు, ఎల్‌ఐసి ఏజెంట్ల వల్లనే ఎల్‌ఐసి సంస్థ నడుస్తోందని, లాభాల బాటలో ఉందని పలువురు ఉద్ఘాటించారు. ప్రభుత్వ రంగంపై మోడీ పాలనలో దాడి నానాటికీ పెరుగుతోందని, ఈ నేపథ్యంలో పోరాటాలకు పదును పెట్టాలని తొలిరోజు సభలో ప్రతినిధులు ప్రతినబూనారు. వైజాగ్ స్టీల్‌ప్లాంట్ దేశంలోనే తీర ప్రాంతంలో ఉన్న ఏకైక స్టీల్ పరిశ్రమగా వెలుగొందుతోందని, 2020 నుంచి దాన్ని తెగనమ్మే కుట్రలకు కేంద్రం పాల్పడుతోందని సిఐటియు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్.నర్సింగరావు జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద జరిగిన భారీ బహిరంగ సభలో ఉద్ఘాటించారు. ఇక్కడి కార్మికవర్గం చేస్తున్న పోరాటాలకు ఉత్తరాంధ్ర ప్రజల సెంటిమెంట్ తోడై ఉద్యమానికి మద్దతుగా నిలిచినందునే ఒక శాతం కూడా స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ జరగకుండా అడ్డుకోగలిగామన్నారు. దేశంలోని సెయిల్‌లో ఇప్పటికే 35 శాతం డిజిన్వెస్ట్‌మెంట్ జరిగిందని, వైజాగ్ స్టీల్‌ను కార్పొరేట్లు ముట్టుకోనివ్వకుండా ఇక్కడి కార్మికవర్గం ఉధృత పోరాటాలను సాగించడం దేశంలోనే గొప్పవిషయమన్నారు.

## 'జగనన్నకు చెబుదాం' అర్జీలను పరిష్కరించాలి

అదనపు కమిషనర్ డాక్టర్ వి.సన్యాసిరావు, ప్రధాన ఇంజినీర్ రవికృష్ణరాజు, పట్టణ ప్రణాళికాధికారి బి.సురేష్ కుమార్, కార్యదర్శి నల్లనయ్య, డిసి (రెవెన్యూ) ఫణిరామ్ పాల్గొన్నారు.

## గ్రామాల్లో వైసిపి నాయకుల భూదందా

నారాయణరాజు పేట, అల్లు పేట, మజ్జి పేట, సింగనబంద, లక్ష్మీపురం గ్రామాల్లో రైతులకు చెందిన రికార్డులను వైసిపి నాయకులు మార్పు చేసి భూకబ్జాలకు పాల్పడుతున్నారని అన్నారు. తాత, ముత్తాతలు దగ్గర నుంచి అనేక సంవత్సరాలుగా రైతులు వారి పేరున రికార్డులు కలిగి ఉన్నారని తెలిపారు. ఈ గ్రామాలకు చెందిన 250 మంది రైతులు సర్వే నెంబర్ 1 నుంచి 85 సబ్ డివిజన్లలో450 ఎకరాల భూమిని సాగు చేస్తున్నారన్నారు. అన్ని రికార్డుల్లో వీరి పేర్లే ఉన్నాయన్నారు. ఇప్పుడు స్థానిక ఎమ్మెల్యే ప్రోద్బలంతో రెవెన్యూ వారు దొంగ సర్వే చేశారని, ఆ సర్వేలో వీరి పేర్లు తొలగించి వైసిపి నాయకులు దాట్ల పెదబాబు, స్థానిక సర్పంచ్ సూర్యనారాయణ పేర్లు నమోదు చేశారని తెలిపారు. ఈ భూముల విలువ సుమారు రూ.4 వేల కోట్లు ఉంటుందని, భూములు హైవేకు దగ్గరగా ఉన్నాయని తెలిపారు. ఆ భూముల్లో అమాయక రైతుల పేర్లను తారుమారు చేసి వైసిపి నాయకులు దుర్మార్గ చర్యలకు పాల్పడ్డారని మండిపడ్డారు. వారికి సహకరించిన అధికారులను కఠినంగా శిక్షించాలని, నిందితులను అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. స్థానిక ఎమ్మెల్యే రైతుల పక్షాన ఉండకుండా దాట్ల పెదబాబు మీద కనికరం చూపిస్తున్నారన్నారు. ఇప్పటికైనా ఆయన తీరు మార్చుకోవాలన్నారు. ఈ వ్యవహారంపై కలెక్టర్ దర్యాప్తు జరిపి బాధిత రైతులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.

**ఉధృతమౌతున్న నారాయణరాజు పేట రైతుల భూ పోరాటం**

**భీమునిపట్నం :** 'ఇంతింతై వటుడింతై' అన్నట్టుగా తొలుత వినతి పత్రాలు, విజ్ఞప్తులతో ఆరంభమైన మండలంలోని నారాయణరాజు పేట రెవెన్యూ గ్రామ పరిధిలో ఉన్న రైతుల భూపోరాటం నేడు ఉధృతమవుతోంది. అందులో భాగంగా సోమవారం తహశీల్దార్ కార్యాలయం వద్ద పెద్ద ఎత్తున రైతులు ధర్నా నిర్వహించారు. తహశీల్దార్ కోరాడ వేణుగోపాల్‌కు వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆర్‌డిఓ కార్యాలయానికి వెళ్లి ఎఓ పోలరాజు కు సమస్య తీవ్రతను వివరించారు. రైతులుకు న్యాయం చేయాలని సిపిఎం నాయకులు రవ్వ నరసింగరావు, ఎస్.అప్పలనాయుడు రెవెన్యూ అధికారులను డిమాండ్ చేశారు. రైతుల భూపోరాటానికి తొలి నుంచీ మద్దతుగా నిలిచిన వారు తహశీల్దార్ కార్యాలయం వద్ద జరిగిన ధర్నాలోనూ పాల్గొన్నారు. కార్యక్రమంలో రైతులు కనకల వెంకటరమణ, కాళ్ల ఆదినారాయణ, అల్లు చిన్నయ్య, గాడు అంజిబాబు, కరుభుక్త లక్ష్మి, కరుభుక్త నారాయణప్పడు, సత్యం, లొడగల లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు. ధర్నా సందర్భంగా తహశీల్దార్ స్పందిస్తూ డ్రాఫ్ట్ ఎస్ఎఫ్ఎపై ఇప్పటికే రైతుల నుంచి అభ్యంతరాలు స్వీకరించామని, ఈ నెల 24, 25 తేదీల్లో నారాయణరాజుపేట గ్రామ సచివాలయం వద్ద అభ్యంతరాలు స్వీకరిస్తామని స్పష్టం చేశారు.

## ఘనంగా జీవ వైవిధ్య పరిరక్షణ దినోత్సవం

**ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ :** జీవులను కాపాడే బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని సెంటర్ ఫర్ ఉమెన్స్ స్టడీస్ డైరెక్టర్ పి.ఉష అన్నారు. సోమవారం ఉదయం ఆంధ్ర యూనివర్సిటీలో వైజాగ్ ఎన్‌జిఓస్ ఫోరంతో కలిసి జీవ వైవిధ్య పరిరక్షణ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అనేక జాతుల జీవులు అంతరించిపోతున్నాయంటూ ఆందోళన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో బయోడైవర్సిటీ బోర్డ్ రీజనల్ కో-ఆర్డినేటర్ జానకిరామ్, రత్నం పాల్గొన్నారు.

# బిజెపి, వైసిపి అరాచక పాలనపై పోరాటం

### సిపిఎం విశాఖ జిల్లా కార్యదర్శి జగ్గునాయుడు

మాట్లాడుతున్న జగ్గునాయుడు

**ప్రజాశక్తి - కలెక్టరేట్ :** కేంద్రంలోని బిజెపి, రాష్ట్రంలోని వైసిపి ప్రభుత్వాల అరాచక పాలనను అంతమొందించేందుకు ప్రజా పోరాటాలను ఉధృతం చేయాలని సిపిఎం విశాఖ జిల్లా కార్యదర్శి ఎం.జగ్గనాయుడు పిలుపునిచ్చారు. డాబాగార్డెన్స్‌లోని అల్లూరి సీతారామరాజు విజ్ఞాన కేంద్రంలో సోమవారం జరిగిన సిపిఎం విశాఖ జిల్లా కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. అంతర్జాతీయ మార్కెట్‌లో ముడి చమురు ధరలు తగ్గినప్పటికీ మోడీ ప్రభుత్వం దేశంలో వంట గ్యాస్, పెట్రోలు, డీజిల్ ధరలను పెంచి ప్రజల నడ్డి విరుస్తోందన్నారు. అంబానీ వంటి కార్పొరేట్లకు బహుళ ప్రయోజనాలు చేకూర్చుతోందన్నారు. నల్లధనం వెలికితీత హామీ ఏమైందని మోడీ సర్కారును ప్రశ్నించారు. పెద్ద నోట్ల రద్దు విఫల ప్రయోగమని తేలినా, మరలా రూ.2 వేల నోట్ల రద్దు చేస్తామని ఆర్‌బిఐ ద్వారా కేంద్ర ప్రభుత్వం ప్రకటించిందని అన్నారు. దీనివల్ల కూడా సంపన్నులకు తప్ప దేశ ప్రజలకు ఎటువంటి ప్రయోజనమూ ఉండదన్నారు. మహిళా రెజ్లర్లపై బిజెపి ఎంపీ బ్రిజ్‌భూషన్ సింగ్ లైంగిక వేధింపులకు పాల్పడినా చోద్యం చూడటం దారుణమన్నారు. అతనిపై చర్య తీసుకోవాలని రెజ్లర్లు ఆందోళన చేస్తున్నా మోడీ ప్రభుత్వం ఇంత వరకు ఏ చర్యా తీసుకోకపోవడం శోచనీయమని అన్నారు. రాష్ట్రంలో పోరాడేవారిపైనా, కార్మికులపైనా వైసిపి ప్రభుత్వం నిర్బంధాన్ని తీవ్రం చేయడం ఆందోళనకరమన్నారు. విశాఖలో చట్టపరంగా కనీస వేతనాలు అమలు చేయాలంటూ ఆందోళన చేసిన మున్సిపల్ క్లాప్ డ్రైవర్లు, యూనియన్ నాయకులపై బైండోవర్ కేసులు పెట్టడం దుర్మార్గమన్నారు. క్లాప్ డ్రైవర్లకు నెలకు రూ.18,500 జీతం చెల్లించాలని లేబర్ కమిషనర్ ఉత్తర్వులు ఇచ్చినా అమలు కాలేదన్నారు. స్టీల్‌ప్లాంట్ రక్షణ కోసం నిరసన తెలియజేస్తే అక్రమ అరెస్టులు, కేసులు బనాయించారన్నారు. సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు వి.నరేంద్ర కుమార్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఆర్‌కెఎస్‌వి.కుమార్, బి.జగన్, నాయకులు ఎవి.సత్యనారాయణ ప్రసంగించారు. పార్టీ జిల్లా కమిటీ సభ్యులు పి.మణి, వి.కృష్ణారావు, ఎం.సుబ్బారావు, బి.వెంకటరావు, యుఎస్ఎన్.రాజు పాల్గొన్నారు.

## వేసవి క్రీడా శిక్షణ శిబిరాలతో ఎంతో మేలు

**ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ :** పిల్లల్లో శారీరక ఎదుగుదల, మానసిక బలం పెంపుదలకు వేసవి క్రీడా శిక్షణ శిబిరాలు ఎంతగానో ఉపయోగపడతాయని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున అన్నారు. సోమవారం ఉదయం స్థానిక స్వర్ణ భారతి ఇండోర్ స్టేడియంలో తలపెట్టిన వేసవి శిక్షణ శిబిరం ప్రారంభోత్సవ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ దాదాపు రెండేళ్ల తర్వాత వేసవి శిక్షణ శిబిరం నిర్వహిస్తున్నందుకు ఆనందంగా ఉందని, దీనికి కారణమైన నగర మేయర్ గొలగాని వెంకట హరి కుమారి, జివిఎంసి కమిషనర్ సాయికాంత్‌వర్మలను అభినందించారు. తల్లిదండ్రులు, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు క్రీడల్లో ఆసక్తి చూపే పిల్లలను ప్రోత్సహించాలని అన్నారు. వేసవి శిక్షణ శిబిరాల వల్ల పిల్లల్లో వివిధ క్రీడల్లో నైపుణ్యం, శారీరక ఎదుగుదల, మానసిక బలం పెరుగుతాయన్నారు.

మేయర్ గొలగాని హరి వెంకట కుమారి మాట్లాడుతూ వేసవి శిక్షణ శిబిరాలను 6 నుంచి 15 వయసుగల పిల్లలకు 15 రోజులు పాటు నిర్వహిస్తామని అన్నారు. జూన్ 6 వరకు ఉదయం 6 గంటల నుంచి 8 గంటల వరకు జివిఎంసి అన్ని జోన్లు, వార్డుల్లో ఈ శిబిరాలు ఉంటాయని, మొత్తం 333 శిక్షణ శిబిరాలు ఏర్పాటు చేశామని తెలిపారు. 8 వేల మంది పిల్లలు ఈ శిబిరాల్లో పాల్గొంటారని, 33 రకాల క్రీడల్లో శిక్షణ ఇవ్వనున్నామని తెలిపారు. శిక్షణ శిబిరంలో పిల్లలకు అల్పాహారం, పాలు, గుడ్డు, టీ షర్టు ఏర్పాటు చేశామని అన్నారు. కార్యక్రమంలో పోలీస్ కమిషనర్ త్రివిక్రమ్ వర్మ, జివిఎంసి కమిషనర్ సాయికాంత్ వర్మ, డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్, జివిఎంసి ఫ్లోర్ లీడర్లు, కార్పొరేటర్లు, స్పోర్ట్స్ అసోసియేషన్ల నిర్వాహకులు, పెద్ద సంఖ్యలో బాలబాలికలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా తలపెట్టిన సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి.

## పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి

**ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ :** నగరంలో పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని జివిఎంసి కమిషనర్ సిఎం.సాయికాంత్ వర్మ ప్రజా ఆరోగ్యపు అధికారులను ఆదేశించారు. సోమవారం క్షేత్రస్థాయి పర్యటనలో భాగంగా కురుపాం మార్కెట్, టౌన్ హాల్ రోడ్డు, వన్‌టౌన్ పోలీస్ స్టేషన్ రోడ్డు, కోటవీధి, పెరివీధి, ఫిషింగ్ హార్బర్, కొప్పుల వీధి తదితర ప్రాంతాలలో పర్యటించారు.

## ఆర్‌టిసి విశ్రాంత ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

**ప్రజాశక్తి - కలెక్టరేట్ :** ఎపిఎస్ ఆర్‌టిసిలో ఉద్యోగ విరమణ చేసిన వారికి ఇవ్వాల్సిన గ్రాట్యుటీ, ఇతర సెటిల్‌మెంట్లను తక్షణం పూర్తి చేయాలని డిమాండ్ చేస్తూ సోమవారం ఆర్‌టిసి ఆర్‌ఎం కార్యాలయం ఎదుట ఎపిఎస్ ఆర్‌టిసి రిటైర్డ్ ఎంప్లాయీస్ అసోసియేషన్ రీజినల్ కమిటీ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. మరణించిన రిటైర్డ్ ఉద్యోగికి మట్టి ఖర్చుల కింద రూ 25 వేలు ఇవ్వాలని, రిటైర్డ్ ఉద్యోగుల పెండింగ్ సమస్యలను పరిష్కరించేందుకు చొరవ తీసుకోవాలని నినాదాలు చేశారు. మెడికల్ స్కీములో చేరిన రిటైర్డ్ ఎంప్లాయికి మెరుగైన సదుపాయాలు కల్పించాలన్నారు. ఈ మేరకు ఆర్‌ఎం అప్పలరాజుకు వినతిపత్రం సమర్పించారు. కార్యక్రమంలో అసోసియేషన్ విశాఖ రీజినల్ ప్రధాన కార్యదర్శి వి.తులసీరామ్, ఎస్‌బి.బాబు, ఎన్ఎస్.నారాయణ, ఇఎస్.నారాయణ, ఎన్ఎం.కృష్ణ, బాబు, శ్రీనివాస్‌మూర్తి, సిహెచ్‌వి.రాజు పాల్గొన్నారు.

# ఉపాధి పనులు అరకొరే..!

గొర్లెవానిపాలెంలో పనులు చేపడుతున్న ఉపాధి కూలీలు

**(మొదటి పేజీ తరువాయి..)** వారీగా పనులు చేయడంతో చేసిన పనికి తగిన వేతనం కూలీలకు లభించేది. ఇప్పుడు గ్రూపుల వారీగా పనిచేసే పద్ధతిని కేంద్ర ప్రభుత్వం రద్దు చేసింది. పని ప్రాంతంలో కూలీలందరూ చేసే పని మొత్తానికి విలువ కట్టి వేతనం నిర్ణయించడంతో కూలి తక్కువ వస్తోందని కూలీలు తెలిపారు. గ్రూపు చేసిన పనికి విలువ కట్టి వేతనం చెల్లిస్తే పనిచేసిన కూలీలకు ఎక్కువ వేతనం వస్తుందని అభిప్రాయపడుతున్నారు. ప్రభుత్వం నిర్ణయించిన రోజువారీ కూలి రూ.272 రావడంలేదని కూలీలు చెబుతున్నారు. తుప్పలు కొట్టిన రోజుల్లో రూ.150, రూ.180 మాత్రమే వస్తోందని, మట్టి పనులు చేసిన రోజు రెండు వందల రూపాయల వరకు లభిస్తున్నాయని కూలీలు చెబుతున్నారు.

గతంలో మంచినీరుకు రోజుకు ఐదు రూపాయలు, గునపం పనికి అదనంగా పది రూపాయలు, తట్ట ఛార్జీల నిమిత్తం రోజుకు మూడు రూపాయల చొప్పున ఉపాధి పనులు చేసిన కూలీల పేర వేతనాల్లో జమయ్యేవి. ఇపుడా ప్రోత్సాహాలన్నింటినీ ప్రభుత్వం రద్దు చేసింది. వేసవి అలవెన్సు కూడా ఇవ్వడం నిలిపివేసింది. వర్షాలు పడ్డ రోజుల్లో మట్టి పనులు జరిగినట్లు, వర్షాల్లేని రోజుల్లో జరగడంలేదని, మట్టి తవ్వుతుంటే చేతులు పొక్కిపోతున్నాయని చూసుకొండ రాజు వాపోయాడు. వేసవి రోజుల్లో గతంలో ఇచ్చిన అదనపు వేతనం ఇచ్చి కూలీలను ఆదుకోవాలన్నాడు. పని ప్రదేశంలో ఏర్పాటు చేసిన టెంట్‌లు ఇప్పుడులేకపోవడంతో ఎండ తీవ్రతను తట్టుకోలేక అలసిన కూలీలు ఎండలోనే కాసేపు కూర్చొని మళ్లీ పనులు చేస్తున్నారు. మట్టి పనులు చేసినప్పుడు దెబ్బతగిలితే నాడు ప్రాథమిక చికిత్స కిట్ పని ప్రదేశంలో వుండేది. ఆ కిట్‌లు ఇప్పుడు ఇవ్వకపోవడంతో పనిచేసినప్పుడు దెబ్బ తగిలిన కూలీలు ఆకు పసరను దెబ్బతగిలిన చోట పిండితున్నారు. తరువాత ఆస్పత్రులకు వెళ్తున్నారు.

**In The Court Of The Principal Junior Civil Judge :: Nuzvid**
**O.S.No. 96/2020**

***Between:***
State Bank Of India, Nuzvid town Branch Rep. by its Branch Manager /Principal Officer. ***...Plaintiff***

**Vs**

1) Kurupa Venkata Lakshmi, D/o. Bala Krishna, Hindu, aged 26 years, Properties and resident Padmanabham Village, Padmanabham Mandal, Visakhapatnam Dist.
2) Kurupa Bala Krishna, S/o. Ramaiah, Hindu, aged 59 years, Properties and resident Padmanabham Village, Padmanabham Mandal, Visakhapatnam Dist.

***...Defendants***

**NOTICE**

Please take notice that the above said matter is posted to **27-06-2023 at 10:30 hours before the Hon'ble Court** for the appearance of above named defendants either in person or through their counsel to submit answer to the claim of plaintiff. If you fail to appear as said the matter would be decided in your absence as per law.

**K.V.K.VIKRAM KUMAR**
Advocate for Plaintiff/s,
Nuzvid, Eluru District.

# విద్యుత్ సమస్య పరిష్కారానికి వినతి

## నిద్రలేని రాత్రుళ్లు గడుపుతున్నామంటూ కొయ్యపేట గ్రామస్తుల ఆవేదన

ఎఇ జగన్మోహన్‌రావుకు సమస్యను వివరిస్తున్న కొయ్యపేట గ్రామస్తులు

**ప్రజాశక్తి-పద్మనాభం :** పద్మనాభం మండలం నేరెళ్లవలస పంచాయతీ పరిధి కొయ్యపేటలో విద్యుత్ సమస్యను పరిష్కరించాలని కోరుతూ గ్రామస్తులు సోమవారం ఎఇ జగన్మోహన్‌రావుకు వినతిపత్రం అందించారు. వారం రోజులుగా విద్యుత్ సరఫరా నిరంతరమూ ఆగిపోవడం, రాత్రుళ్లు అసలు కరెంటు ఉండకపోవడంతో విసుగు చెందిన గ్రామస్తులు 60 మంది మూడు ఆటోలు, 10 ద్విచక్రవాహనాలపై ఎఇ కార్యాలయానికి చేరుకొని ఆగ్రహం వ్యక్తంచేశారు. సమస్యను వివరిస్తూ వినతిపత్రం అందించారు. గ్రామంలో ట్రాన్స్‌ఫార్మర్లు, కండక్టర్లు ఏర్పాటుచేయాలని గ్రామస్తులు కోరారు. ఏడాది నుంచి లో-వోల్టేజీ సమస్య తీవ్రంగా ఉందని, ఎన్నిసార్లు ఫిర్యాదులు చేసినా ఫలితం లేకపోయిందని ఆవేదన వ్యక్తంచేశారు. ఎండలు, ఉక్కపోతతో చిన్నపిల్లలు, వృద్ధులు నానా అవస్థలు పడుతున్నారని తెలిపారు. గ్రామానికి హుదూద్ తుపాను సమయంలో కేబుల్ వైర్లు వేశారని, వాటిలో ఎక్కడో లోపాలున్నాయని, వాటిని వెంటనే మార్చాలని విజ్ఞప్తిచేశారు. గ్రామానికి చెందిన లైన్‌మాన్, మరో ఇద్దరు కలిసి రోజంతా లైన్‌లో తనిఖీ చేసినా లోపాలను పట్టుకోలేక పోతున్నారని వివరించారు. లైన్‌లో లోపాలతో నిరంతరం విద్యుత్ సరఫరా సమస్యలు తలెత్తుతున్నాయని, శాశ్వతంగా సమస్యను పరిష్కరించాలని కోరారు.

**10 రోజుల్లో పరిష్కరిస్తాం : ఎఇ**

గ్రామంలో విద్యుత్ సమస్యను పరిష్కరించేందుకు కృషిచేస్తున్నామని ఎఇ జగన్మోహనరావు తెలిపారు. పాత కేబుల్, కండక్టర్ల మార్పు, మరమ్మతుల్లో ఉన్న స్తంభాల తొలగింపు తదితరాలను రూ.4 లక్షలతో చేపడుతున్నట్లు చెప్పారు. పది రోజులు పనులు పూర్తి చేస్తామని, అంతవరకు గ్రామస్తులు సంయమనం పాటించాలని కోరారు.

మొక్కలు నాటుతున్న విసి ప్రసాదరెడ్డి

## వర్సిటీ ప్రాంగణాన్ని పర్యావరణహితంగా మలచాలి

**ప్రజాశక్తి-విశాఖపట్నం :** ఆంధ్రవిశ్వవిద్యాలయం ప్రాంగణాన్ని పర్యావరణహితంగా మలచాలని ఏయూ వీసీ ఆచార్య పివిజిడి ప్రసాదరెడ్డి సూచించారు. సోమవారం ఉదయం ఏయూ హార్టికల్చర్ విభాగంలో ఔషధ, అలంకరణ, నీడనిచ్చే మొక్కల పెంపకాన్ని ప్రారంభించారు. వర్సిటీ అధికారులతో కలసి మొక్కలను నాటారు. వర్షాకాలం ప్రారంభమయ్యే సమయానికి వర్సిటీలో ప్రణాళికా బద్ధంగా మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టాలని సూచించారు. పక్షులకు ఆశ్రయం ఇస్తూ, ఆహ్లాదాన్ని పంచే విధంగా ఉండే మొక్కలను ఎంపిక చేయాలన్నారు. భవనాలకు సమీపంలో కాకుండా దూరంగా మొక్కలను నాటి, పెంచాలని సూచించారు. వర్సిటీలో వృక్షాలు పెంచడానికి అనువైన ప్రాంతాలను గుర్తించి, విద్యార్థులను భాగం చేస్తూ మొక్కలు నాటే కార్యక్రమం త్వరలో ప్రారంభిస్తామన్నారు. దీనికి అవసరమైన మొక్కలను వర్సిటీలో సొంతంగా తయారుచేసే విధంగా పనులు చేపట్టాలని సూచించారు. ఈ సందర్భంగా వర్సిటీ స్వయంగా అభివృద్ధి చేస్తున్న నర్సరీలో పలు మొక్కలు, వాటి ప్రత్యేకతలను వీసీ అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో రెక్టార్ ఆచార్య కె.సమత, ప్రిన్సిపల్స్ ఆచార్య ఎ.నరసింహారావు, వి.విజయలక్ష్మి, టి.శోభశ్రీ, బ్యూటిఫికేషన్ విభాగం గౌరవ సంచాలకులు డాక్టర్ జి.వీర్రాజు, డాక్టర్ జె.ప్రకాశరావు, శ్రీధర్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

## అపోలోలో వృద్ధునికి అరుదైన శస్త్ర చికిత్స

**ప్రజాశక్తి - ఆరిలోవ :** ఆరిలోవ హెల్త్‌సిటీ అపోలో ఆసుపత్రిలో 80 ఏళ్ల వ్యక్తికి అరుదైన శస్త్ర చికిత్స విజయవంతంగా నిర్వహించారు. దీనికి సంబంధించి అపోలో వైద్యుల కథనం ప్రకారం... విశాఖపట్నం మురళీనగర్‌కు చెందిన వృద్ధునికి ఏడాది నుంచి ఊపిరి పీల్చుకోవడం ఇబ్బందిగా ఉండేది. కుటుంబ సభ్యులు అపోలో వైద్యులను సంప్రదించారు. ఈయనకు రెండు నెలలుగా క్షయ వ్యాధి తీవ్రంగా ఉన్నట్టు గుర్తించారు. ఇసిజి, ఎకోకార్డియాగ్రామ్ పరీక్షలు నిర్వహించి వ్యాధిని గుర్తించారు. రోగి వయస్సు, ఇతర ఆరోగ్య సమస్యలు కారణంగా శస్త్ర చికిత్స చేయడానికి నిరాకరించారు. టిఎవిఆర్ చికిత్స అనుకూలంగా పరిగణించారు. ట్రాన్స్ అయోర్టిక్ వాల్యులర్ గ్రోయిన్ రీజియన్ ద్వారా సబ్కుటానియస్‌ను బర్తీ చేశారు. శస్త్ర చికిత్స జరిగిన మూడు రోజుల అనంతరం ఎటువంటి అనారోగ్య సమస్యలు లేని కారణంగా రోగిని డిశ్చార్జ్ చేశారు. ఈ సర్జరీని విజయవంతంగా నిర్వహించిన అపోలో కార్డియాలజీ బృందం డాక్టర్ డికె.బారువా, డాక్టర్ ఎన్‌కె.పాణిగ్రహి, డాక్టర్ శశాంక్, డాక్టర్ చక్రధర్ పేడాడ, డాక్టర్ రవికాంత్‌లను అపోలో యాజమాన్యం అభినందించింది.

## జూ పార్కులో మొక్కల నాటివేత

**ప్రజాశక్తి - ఆరిలోవ :** బయో డైవర్సిటీడే ను పురస్కరించుకొని ఇందిరాగాంధీ జంతు ప్రదర్శన శాల ఆధ్వర్యాన సోమవారం జూ పార్కు పరిసరాల్లో మొక్కలు నాటారు. స్థానిక చెట్ల నుంచి పలు విత్తనాలు సేకరించారు. ఈ సందర్భంగా జూ క్యూరేటర్ డాక్టర్ నందనీ సలారియా మాట్లాడుతూ, చెట్ల నుంచి సేకరించిన విత్తనాలను భవిష్యత్‌లో నాటేందుకు సంరక్షిస్తామన్నారు. అనంతరం జూ సిబ్బంది, వృక్ష ప్రేమికులు కలిసి బయో డైవర్సిటీపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. మొక్కలను సంరక్షిస్తాం.. పర్యావరణాన్ని కాపాడుతాం అని ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో జూ అధికారులు, సిబ్బంది, జూ ఎడ్యుకేషన్ బృందం సభ్యులు పాల్గొన్నారు.

## పెట్రోల్ బంకులకు రూ.2 వేల నోట్లు

### - రూ.1500కి వేసుకుంటేనే చిల్లర అంటూ బోర్డులు

**ప్రజాశక్తి-సింహాచలం :** కేంద్ర ప్రభుత్వం రూ.2 వేల నోట్లను ఉపసంహరించుకుంటున్నట్లు ప్రకటించడంతో ఇంత వరకు చలామణిలోకి రాని ఆ నోట్లు ఇప్పుడు తామరతంపరగా బయటకొస్తున్నాయి. దేవస్థానం పెట్రోల్ బంకుకు ఇటీవల ఎక్కువగా రూ.2 వేల నోట్లను తీసుకొచ్చి పెట్రోల్ పోయించుకుంటున్నారు. దీంతో చిల్లర సమస్య ఏర్పడుతోంది. దేవస్థానం అధికారులు, సిబ్బంది స్పందించి దేవస్థానం బంకుల్లో కనీసం రూ.1500 పెట్రోల్ కొనుగోలు చేస్తేనే రూ.2 వేలు తీసుకుంటామని నోటీసులు బోర్డులు ఏర్పాటుచేశారు.

## అప్పన్నను దర్శించుకున్న హైకోర్టు జడ్జి

**ప్రజాశక్తి-సింహాచలం:** సింహాద్రి అప్పన్నను సోమవారం హైకోర్టు జడ్జి గోపాలకృష్ణ దంపతులు దర్శించుకున్నారు. వీరికి ఆలయ ఇన్‌స్పెక్టర్ సిరిపురం కనకరాజు, ప్రధానార్చకులు గోడవర్తి శ్రీనివాసాచార్యులు సాదరంగా స్వాగతం పలికారు. జడ్జి దంపతులు ముందుగా కప్పస్తంభాన్ని ఆలింగనం చేసుకున్నారు. బేడా మండపం చుట్టూ ప్రదక్షిణ చేశారు. స్వామి అంతరాలయంలోనూ, గోదాదేవి సన్నిధిలోనూ, గోత్రనామాలతో ప్రత్యేక పూజలు జరిపారు. అనంతరం ఆస్థాన మండపంలో అర్చకులు ఆశీర్వదించారు. అధికారులు వారికి ప్రసాదాన్ని అందించారు.

## ప్రతిభా పురస్కారాలకు గురుకుల విద్యార్థులు

**ప్రజాశక్తి -భీమునిపట్నం :** పదో తరగరతిలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన స్థానిక ఎపి బాలికల గురుకుల పాఠశాలకు చెందిన విద్యార్థులు ప్రతిభా పురస్కారాలకు ఎంపికయ్యారు. ఈ మేరకు ప్రిన్సిపల్ కోడి రాంబాబు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర, జిల్లా స్థాయిలో జామి కల్పన (591), ఎం.తేజశ్రీ (588), కె.సాయి, కె.నిహారిక, ఎస్.సౌజన్య (586) మార్కులు సాధించి ఉత్తమ ప్రతిభా పురస్కారాలకు ఎంపికైనట్లు వివరించారు. వీరంతా ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో ఎంపికైనట్లు పేర్కొన్నారు.

## పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమావేశం

**ప్రజాశక్తి- ఆనందపురం :** ఆనందపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 2002-03 బ్యాచ్ పదో తరగతి అదే పాఠశాలలో ఆత్మీయ సమావేశం నిర్వహించుకున్నారు. అలనాటి జ్ఞాపకాలను గుర్తుచేసుకున్నారు. 20 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా ఈ ఆత్మీయ కలయిక ఏర్పాటుచేసుకున్నట్లు పూర్వ విద్యార్థులు తెలిపారు. భవిష్యత్ తరాలకు ఉపయోగపడే మంచి కార్యక్రమాలు చేయాలని నిర్ణయించుకున్నారు. అనంతరం బరువెక్కిన హృదయాలతో తిరుగుపయనమయ్యారు. ఈ కార్యక్రమంలో మామిడి శేఖర్, దుక్క రాము, గొర్లె సంతోష్, బోధ సురేష్, కనకరాజు, సంతోష్, పాలవలస శ్రీను తదితరులు పాల్గొన్నారు.

# వాలంటీర్లకు సన్మానం

**ప్రజాశక్తి-యంత్రాంగం**

**భీమునిపట్నం :** మండలంలో సేవా మిత్ర, సేవా రత్న అవార్డులకు ఎంపికైన వాలంటీర్లను రేఖవానిపాలెం పంచాయతీలో సోమవారం సాయంత్రం ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు సత్కరించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో ఆయన మాట్లాడుతూ, నవ రత్నాలను ప్రజల ముంగిటకు తీసుకెళ్తున్న వాలంటీర్ల కృషి ఎంతో గొప్పదని కొనియాడారు. సర్పంచ్ సమ్మిడి శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగిన సభలో ఎంపిపి డి.వాసురాజు, ఎఎంసి చైర్మన్ యలమంచిలి సూర్యనారాయణ, పలువురు సర్పంచులు, ఎంపిటిసి సభ్యులు, ఎండిఒ పి.వెంకటరమణ, తహసీల్దార్ కోరాడ వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

వాలంటీర్ల సన్మానంలో ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు

**ఆనందపురం :** ఆనందంలో మండలం బోని పంచాయతీలో వాలంటీర్లను ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గడప గడపకూ వెళ్లి నేరుగా ప్రజలకే సేవలందేలా వాలంటీర్ వ్యవస్థను ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి తెచ్చారన్నారు. వాలంటీర్లు మరింత బాధ్యతతో పనిచేసి ప్రభుత్వానికి మంచి పేరు తీసుకురావాలని కోరారు. అనంతరం మండలంలోని 230 మంది వాలంటీర్లను సన్మానించి అభినందించారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ లవరాజు, జడ్‌పిటిసి సభ్యులు కోరాడ వెంకటరావు, ఎంపిపి మజ్జి శారదాప్రియాంక, వైస్ ఎంపిపి పాండ్రంగి శ్రీను, బొట్ట ధనలక్ష్మి రామకృష్ణ, బంక సత్యనారాయణ, అప్పలనాయుడు, బోని అప్పలకొండ, సన్యాసినాయుడు తదితరులు పాల్గొన్నారు.

# జీవ సమతుల్యతకు ప్రాధాన్యం

**ప్రజాశక్తి -యంత్రాంగం**

**భీమునిపట్నం :** ప్రతి ఒక్కరూ జీవ సమతుల్యతకు ప్రాధాన్యం ఇవ్వాలని స్థానిక ప్రభుత్వ డైట్ ప్రిన్సిపల్ యు.మాణిక్యంనాయుడు కోరారు. స్థానిక ప్రభుత్వ డైట్‌లో సోమవారం అంతర్జాతీయ జీవ వైవిధ్య దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా మాణిక్యంనాయుడు మాట్లాడుతూ, ప్రతి ఒక్కరూ జీవ సంరక్షణ పట్ల అవగాహన కలిగి ఉండాలన్నారు. ఈ సందర్భంగా జీవ వైవిధ్యంపై విద్యార్థులు ప్రదర్శించిన నాటికను అధ్యాపకులు తిలకించి అభినందించారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు సోమయాజులు, ఎస్‌కె.అల్లాఉద్దీన్, ఎస్.త్రినాథరావు, గొట్టేటి రవి, మహాలక్ష్మి, హరిణి తదితరులు పాల్గొన్నారు.

జీవ వైవిధ్య దినోత్సవంలో విద్యార్థులు

**జీవ వైవిధ్యాన్ని పరిరక్షించాలి**

**ములగాడ :** జీవవైవిధ్యాన్ని పరిరక్షించినప్పుడే ప్రకృతిలో సమతుల్యత చేకూరుతుందని, తద్వారా పర్యావరణ ప్రగతి సాధ్యపడుతుందని జాతీయ సేవా పథకం సీనియర్ ప్రోగ్రాం అధికారి వై.అనసూయాదేవి అన్నారు. మల్కాపురంలోని శాఖా గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి శిక్షణ శిబిరంలో అంతర్జాతీయ జీవవైవిధ్య దినోత్సవాన్ని పురస్కరించుకొని ఆమె మాట్లాడారు. ప్రస్తుత కాలంలో వేటాడడం, అడవుల నరికివేత, జనాభా పెరుగుదల, పరిశ్రమల నిర్మాణం, రసాయనాల వినియోగం తదితర అనేక కారణాలవల్ల ఎంతో విలువైన జీవజాతులు అంతరిస్తున్నాయని, అది పర్యావరణ ప్రగతికి పెను సవాలుగా మారుతోందని ఆవేదన వెలిబుచ్చారు. ప్రముఖ కవి కె. సత్తిరాజు పర్యావరణంలో పక్షులకు ఉన్న ప్రాధాన్యతను వివిధ కథల రూపంలో చిన్నారులకు వివరించారు. అందరూ ఆవరణ వ్యవస్థ సమతౌల్యతను, జీవవైవిధ్యాన్ని కాపాడడానికి తమ వంతు కషి చేస్తామని ప్రతిన పూనారు. అనంతరం జాతీయ సేవా పథకం సీనియర్ వాలంటీర్ అలేఖ్య ఆధ్వర్యాన చిన్నారులకు నాట్యంలో శిక్షణ ఇచ్చారు. పదేళ్లలోపు పిల్లలకు పోటీలను నిర్వహించారు. ఈ మొత్తం కార్యక్రమాన్ని గ్రంథాలయాధికారి వి.అజయ్‌కుమార్, జాతీయ సేవా పథకం జిల్లా ప్రోగ్రాం అధికారి ఇపిఎస్.భాగ్యలక్ష్మి సమన్వయం చేశారు.

# గడువు సమీపిస్తున్నా స్పందన అంతంతే!

## గాజువాక హౌస్ కమిటీ స్థలాల క్రమబద్ధీకరణకు తక్కువ సంఖ్యలో వచ్చిన దరఖాస్తులు

ప్రజాశక్తి -గాజువాక : గాజువాక ప్రజలను దశాబ్దాల నుంచి గాజువాక హౌస్ కమిటీ సమస్య పట్టిపీడిస్తోంది. తాజాగా ఫిబ్రవరి 22వ తేదీన గాజువాక హౌస్ కమిటీకి సంబంధించి జీవో నెంబర్ 71ను ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి తెచ్చారు. ఈ జీవో ప్రకారం గాజువాక హౌస్ కమిటీకి సంబంధించి భూములు రిజిస్ట్రేషన్ చేసుకునే అవకాశం కల్పించారు. గాజువాక హౌస్ కమిటీ పరిధిలో ఉన్న ప్రజలు గతంలో 301 జీవో ప్రకారం ఇచ్చిన పట్టాలో ఏమైనా తప్పులుంటే ఏప్రిల్ నెల నుంచి సరిదిద్దుకోవాలని జిల్లా కలెక్టర్ ప్రకటించారు. మే 25వ తేదీ లోపు సంబంధిత బాధితులు సచివాలయం వద్ద దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. 301 జీవో ప్రకారం 7000 మందికి అప్పట్లో పట్టాలిచ్చారు. వారిలో 700 మంది మాత్రమే తమ పట్టాల్లో తప్పులున్నాయని సచివాలయాల వద్ద దరఖాస్తు చేసుకున్నారు. వాస్తవానికి గతంలో ఇచ్చిన పట్టాల్లో చాలా తప్పులున్నాయి. అయినా సరిచేసుకునేందుకు ప్రజలు అంతగా ఆసక్తి చూపించకపోవడానికి కారణం గతంలో ఇచ్చిన పట్టాతోపాటు, ఆధార్ కార్డు, ఓటర్ కార్డు, పాన్ కార్డు ఇలా చాలా నిబంధనలు పెట్టారు. అవన్నీ పట్టుకొని సచివాలయానికి వెళ్లి, వారిచ్చిన 24 కాలమ్స్ ఉన్న అప్లికేషన్‌ను నింపి సమర్పించాలి. ప్రభుత్వం మారిన ప్రతిసారి ఈ విధంగా దరఖాస్తు చేయడమే తప్ప సమస్య పరిష్కారం కాకపోవడంతో ప్రజల్లో విశ్వాసం సన్నగిల్లింది. ఈ విషయంలో ప్రజలకు అవగాహన కల్పించడంలో గాజువాక రెవెన్యూ అధికారులు వైఫల్యం చెందారు అని చెప్పక తప్పదు. అందుకే ఇంత తక్కువ దరఖాస్తులు వచ్చాయని స్థానికులు పలువురు అభిప్రాయపడుతున్నారు.

గాజువాక(ఫైల్ ఫోటో)

**చాలామంది దరఖాస్తు చేయాల్సి ఉంది**

ఈ జీవో ప్రకారం చాలామంది దరఖాస్తు చేసుకోవాల్సి ఉందని, గడువు పెంచాలని ఆంధ్రప్రదేశ్ పౌరహక్కుల సంఘం జిల్లా అధ్యక్షులు టి.శ్రీరామ్మూర్తి కోరారు. నాలుగు వార్డుల్లో నివాసముంటున్న ప్రజల సమస్య అని తెలిపారు. 65, 66, 67, 70 వార్డులకు చెందిన ప్రజలు నివసిస్తున్న ప్రాంతాల్లో గత ప్రభుత్వం 7000 పట్టాలు మంజూరు చేసిందని తెలిపారు.

### గడువు పెంచాలి: సిపిఎం

గాజువాక హౌస్ కమిటీకి సంబంధించి దరఖాస్తులు చేసుకోవడానికి గడువు పెంచాలని సిపిఎం గాజువాక జోన్ కార్యదర్శి ఎం.రాంబాబు కోరారు. ఈ జీవో వచ్చిన విషయం చాలామంది సామాన్య ప్రజలకు తెలియదని, రెవెన్యూ అధికారులు ప్రజలకు అవగాహన కల్పించలేదని తెలిపారు. దళారులకు తప్ప పేద ప్రజలకు ఈ జీవో వచ్చిన విషయం తెలీదని పేర్కొన్నారు. గడువు పెంచి, ప్రజలకు అవగాహన కల్పించాలని డిమాండ్ చేశారు.

## 'అరెస్టుకు అడ్డంకులపై గవర్నర్ జోక్యం చేసుకోవాలి'

ప్రజాశక్తి-సీతమ్మధార : రాష్ట్రంలో ఎన్నడూ లేని విధంగా హత్య నేరం ఆరోపించబడిన రాజకీయ నాయకుని అరెస్టుకు అడ్డంకులు సృష్టించడం ఫ్యాక్షన్ రాజకీయాలకు అద్దం పడుతోందని, దీనిపై గవర్నర్ జోక్యం చేసుకోవాలని టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మహమ్మద్ నజీర్ విజ్ఞప్తి చేశారు. వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసులో నిందితునిగా భావిస్తున్న ఎంపీ అవినాష్‌రెడ్డిని అదుపులోకి తీసుకోవడానికి సిబిఐ చేస్తున్న ప్రయత్నాలకు స్థానిక పోలీసులు సహకరించకపోవడం, లా అండ్ ఆర్డర్ సమస్యలు వస్తాయంటూ వైసిపి ఎమ్మెల్యేలు ప్రకటించడం, మీడియా ప్రతినిధులపై దాడులు తదితర అంశాలపై గవర్నర్ దృష్టి సారించాలని కోరుతూ మీడియాకు ప్రకటన విడుదలచేశారు. ఎంపీ అవినాష్‌రెడ్డి సిపిఐ కి సహకరించి నిజాలు వెల్లడించాలని, పార్లమెంట్ సభ్యునిగా ప్రజాస్వామ్యాన్ని కాపాడాలని కోరారు. రాష్ట్రంలోని తాజా రాజకీయ పరిస్థితులు చూస్తుంటే ఒకప్పటి బీహార్ గుర్తుకు వస్తోందన్నారు. న్యూస్ కవరేజ్ చేస్తున్న మీడియా ప్రతినిధులపై అవినాష్ రెడ్డి అనుచరులు దాడులు చెయ్యడం సరికాదన్నారు.

44వ వార్డులో సంక్షేమ పథకాలను వివరిస్తున్న కె.కె.రాజు

## పలు వార్డుల్లో గడపగడపకు మన ప్రభుత్వం

ప్రజాశక్తి -యంత్రాంగం

**కంచరపాలెం** : జివిఎంసి 54వ వార్డు దుర్గ నగర్ -3 సచివాలయం పరిధి రవీంద్ర నగర్‌లో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఉత్తర నియోజకవర్గ వైసిపి సమన్వయకర్త కెకె.రాజు, వార్డు కార్పొరేటర్ చల్ల రజిని ఈశ్వరరావుతో కలిసి ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరించారు. ప్రజల సమస్యలనడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కెకె.రాజు మాట్లాడుతూ, అర్హులకు సంక్షేమ పథకాలు అందుతున్నాయా లేదా తెలుసుకునేందుకు ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు తెలిపారు. ప్రజలు ఇంటి వద్దకే వెళ్లి వారి సమస్యలు తెలుసుకొని పరిష్కరిస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో యువజన విభాగం జోనల్ ఇన్‌ఛార్జి ఎం.సునీల్, రాయుడు శ్రీను, నూకరాజు, చిరంజీవి, రవణమ్మ, వెంగ శ్రీను, నమ్మి శంకర్, రాంబాబు చల్ల బాలకృష్ణ, సారిపల్లి జగదీష్, నాగరాజు, అచ్యుతరావు, దిలీప్ తదితరులు పాల్గొన్నారు.

**44వ వార్డులో...**

**సీతమ్మధార** : జివిఎంసి 44వ వార్డు పరిధి వెంకటేశ్వర న్యూ కాలనీ, నందగిరినగర్, శ్రీనివాసనగర్ ప్రాంతాల్లో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఉత్తర నియోజకవర్గ వైసిపి సమన్వయకర్త కెకె.రాజు, వార్డు కార్పొరేటర్ బాణాల శ్రీనివాసరావు ఇంటింటికీ వెళ్లి ఇప్పటివరకు ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ ఫలాలను వివరించారు. ప్రజల సమస్యలనడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో యువజన విభాగం ఇన్‌ఛార్జి ఎ.సునీల్, నాయకులు బాణాల తరుణ్, హబీబ్, పల్లకిల గోపి, బాక్సర్ వెంకటరావు, మహదాస్యం గోపి, పిడుగు వెంకటరమణ, తదితరులు పాల్గొన్నారు.

## చలివేంద్రం ప్రారంభం

ప్రజాశక్తి-పెందుర్తి : జివిఎంసి 94వ పరిధి కృష్ణరాయపురంలో సీనియర్ సిటిజన్స్ ఆధ్వర్యాన చలివేంద్రాన్ని ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా సీనియర్ సిటిజన్ బిటి.మూర్తి మాట్లాడుతూ, ఏటా ఈ కార్యక్రమాన్ని సీనియర్ సిటిజన్ల సహకారంతో నిర్వహిస్తామని చెప్పారు. నిత్యం ఈ కూడలి రద్దీగా ఉంటుందని, ప్రజల దాహార్తిని తీర్చడానికి ఈ చలివేంద్రం ఎంతో ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ సిటిజన్స్ పాల్గొన్నారు.

చలివేంద్రం ప్రారంభంలో సీనియర్ సిటిజన్లు

స్టీల్ కొనుగోలుదారులతో విశాఖ ఉక్కు సిఎమ్‌డి అతుల్ భట్

## స్టీల్ కొనుగోలుదారులతో యాజమాన్యం సమావేశం

ప్రజాశక్తి-ఉక్కునగరం : స్టీల్ కొనుగోలుదారులతో స్టీల్‌ప్లాంట్‌లో సోమవారం ఉక్కు యాజమాన్యం సమావేశం నిర్వహించింది. దేశం నలుమూలల నుంచి సుమారు వందమంది కొనుగోలుదారులు సమావేశానికి హాజరయ్యారు. కొనుగోలుదారులను ఉద్దేశించి సిఎమ్‌డి అతుల్‌భట్ మాట్లాడుతూ, కొనుగోలుదారుల ప్రాముఖ్యతను వివరించారు. కొనుగోలుదారులతో స్టీల్‌ప్లాంట్ చక్కని అనుబంధాన్ని కలిగిఉందన్నారు. ప్రతి సంవత్సరమూ ఈ కార్యక్రమాన్ని ఏర్పాటుచేస్తామని తెలిపారు. కంపెనీ వృద్ధిలో కొనుగోలుదారులు ప్రముఖ పాత్ర వహిస్తారని పేర్కొన్నారు. ఆగస్టు 23వ తేదీ నుంచి ఉత్పత్తిని పెంచడానికి స్టీల్‌ప్లాంట్ సిద్ధంగా ఉన్నందున 2023-24 గుర్తుండిపోయే సంవత్సరంగా మిగులుతుందన్నారు. కమర్షియల్ డైరెక్టర్ డికే మహంతి మాట్లాడుతూ, 'సరైన సమయంలో'- సరైన ధరకు' అన్న నినాదంతో కస్టమర్ల అవసరాలను తీర్చేందుకు స్టీల్ ప్లాంట్‌కు చెందిన అన్ని రంగాలు ఎప్పుడూ సిద్ధంగా ఉంటాయని తెలిపారు. కార్యక్రమంలో ప్రాజెక్టు డైరెక్టర్ ఏకే బగ్గి, డైరెక్టర్ పర్సనల్ సురేష్చంద్రపాండే, చీఫ్ విజిలెన్స్ ఆఫీసర్ కర్ణరాజు పాల్గొన్నారు.

## మహనీయుల ఆశయ సాధనకు కృషి

ప్రజాశక్తి-ఉక్కునగరం : మహనీయులు డాక్టర్ బిఆర్ అంబేద్కర్, బాబూ జగ్జీవన్‌రామ్, భిర్సా ముండా ఆశయాల సాధనకు మనమంతా కృషి చేయాలని ఎంఎంఎస్ఎం విభాగం ఇన్‌ఛార్జి హెచ్‌ఒడి కృష్ణప్రసాద్ కోరారు. ఎంఎంఎస్ఎం విభాగంలో ఆ మహనీయుల జయంతి వేడుకలు సోమవారం నిర్వహించారు. మహనీయుల చిత్ర పటాలకు కృష్ణప్రసాద్ తదితరులు పూల మాలలు వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా కృష్ణప్రసాద్ మాట్లాడుతూ, బడుగు, బలహీన వర్గాల సంక్షేమం కోసం మహనీయులు పాటుపడ్డారని కొనియాడారు. స్టీల్‌ప్లాంట్ ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయీస్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి బయ్యే మల్లయ్య మాట్లాడుతూ, పేద, బడుగు, బలహీన వర్గాల సంక్షేమం, వారి హక్కుల సాధన కోసం ఈ మహనీయులు కృషిచేశారని కొనియాడారు. బి.రమేష్ అధ్యక్షతన సాగిన ఈ కార్యక్రమంలో అధికారులు మనోజ్ ఒరాన్, బి.గణేష్, వీర్రాజు, శ్రీనివాస్, విద్యుత్‌కుమార్ వర్మ, ఎస్సీ, ఎస్టీ అసోసియేషన్ నాయకులు ఎన్.సత్యనారాయణ, ఎల్‌వి.రమణారావు, దాసరి పుల్లారావు, ఎ.కృష్ణారెడ్డి, ఆర్.సూరిబాబు, జి.ఆనంద్, మౌళి, కె.లక్ష్మీనారాయణ, రవళి, కార్మిక సంఘాల నాయకులు జీబీ.సత్యనారాయణ, జీవీ.రమణారావు, పిట్ట రెడ్డి, వంగపండు సింహాచలం పాల్గొన్నారు.

మహనీయుల జయంతి వేడుకల్లో ఎంఎంఎస్ఎం ప్రతినిధులు

## కరాటే సమ్మర్ క్యాంప్

ప్రజాశక్తి-ఉక్కునగరం : జివిఎంసి 87వ వార్డు పరిధి వడ్లపూడి నిర్వాసిత కాలనీ తిరుమలనగర్ వాకర్స్‌పార్క్‌లో కరాటే సమ్మర్ క్యాంపును కార్పొరేటర్ బోండా జగన్నాధం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, అన్ని వయసుల విద్యార్థులు ఈ క్యాంపును సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కోచ్ కిశోర్ ఆధ్వర్యాన ప్రతి రోజూ వాకర్స్ పార్క్‌లో కోచింగ్ ఇవ్వనున్నారని, పిల్లలు శారీరక దృఢత్వం కోసం కరాటే అవసరమని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాలనీ అసోసియేషన్ సభ్యులు పరమానందం, విశ్వేశ్వరరావు, మూర్తి, శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ అప్పారావు, తదితరులు పాల్గొన్నారు.

## 'ఉత్తరం'లో గ్రీవెన్స్

ప్రజాశక్తి-సీతమ్మధార : ఉత్తర నియోజకవర్గంలో ప్రజల సమస్యలు పరిష్కరించేందుకు వైసిపి సమన్వయకర్త కెకె.రాజు సోమవారం పార్టీ కార్యాలయంలో గ్రీవెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా నియోజకవర్గానికి చెందిన పలువురు వచ్చి సమస్యలతో కూడిన వినతిపత్రాలను కెకె.రాజుకు అందించారు. వినతిపత్రాలను పరిశీలించిన కెకె.రాజు అధికారులతో మాట్లాడి కొన్నింటిని వెంటనే పరిష్కరించారు. మరికొన్నింటికి సంబంధించి అధికారులకు రిఫర్ చేసి త్వరలోనే పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.

## సిసి రోడ్లు, డ్రైయిన్లకు శంకుస్థాపన

ప్రజాశక్తి-సీతమ్మధార : జివిఎంసి 25వ వార్డు పరిధి మధురానగర్ చాకలిగెడ్డ ఏరియాలో రూ.8.50 లక్షలతో సిసి రోడ్లు, డ్రైయిన్లకు కార్పొరేటర్ సారిపిల్లి గోవింద్ సోమవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్థానిక ప్రజల వినతి మేరకు ఈ పనులు చేపడుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సచివాలయ కన్వీనర్ రావాడ వీరమ్మ, వర్క్ ఇన్‌స్పెక్టర్ రవి, సచివాలయ సెక్రటరీలు జ్యోతి, కృష్ణ, అనూష, స్థానిక మహిళలు, కార్యకర్తలు, బూత్ కన్వీనర్లు, సచివాలయ కన్వీనర్లు, గృహసారధులు పాల్గొన్నారు.

# ఉపాధి చట్టం పరిరక్షణకు మళ్లీ ఉద్యమం

## వ్యవసాయ కార్మిక సంఘం, సిఐటియు ఇతర ప్రజాసంఘాల ఆధ్వర్యాన నిరసన ... సచివాలయాల్లో వినతిపత్రాలు అందజేత

**ఉపాధి హామీ చట్టాన్ని నిర్వీర్యం చేయాలని చూస్తోన్న కేంద్రంలోని బిజెపి ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఎపి వ్యవసాయ కార్మిక సంఘం, సిఐటియు ఇతర ప్రజాసంఘాల పిలుపుమేరకు ఆయా సంఘాల ఆధ్వర్యంలో పని ప్రదేశాలు, గ్రామ సచివాలయాల వద్ద ధర్నా, నిరసన ప్రదర్శనలు నిర్వహించారు. కేంద్రానికి వ్యతిరేకంగా భారీగా నినాదాలు చేశారు. సచివాలయాల్లో వినతిపత్రాలను అందజేశారు.**




అచ్యుతాపురం సచివాలయం వద్ద ఉపాధి కూలీల ఆందోళన

**ప్రజాశక్తి - అచ్యుతాపురం** : పోరాడి సాధించుకున్న ఉపాధి హామీ చట్టాన్ని పరిరక్షణకు ఇపుడు మళ్లీ ఐక్యఉద్యమాన్ని చేపట్టాల్సిన అవసరం వచ్చిందని సిఐటియూ జిల్లా ఉపాధ్యక్షులు ఆర్. రాము, రైతుసంఘం జిల్లా అధ్యక్షులు కర్రి .అప్పారావు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు సోమవారం ఉపాధి హామీ చట్టం రక్షణ కోసం పెదపాడు, తిమ్మరావుపేట, కాజీపాలెం సచివాలయాల వద్ద ధర్నా నిర్వహించి, సచివాలయ సిబ్బందికి వినతి పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామీణ పేదలకు పట్టెడు అన్నం పెడుతున్న ఉపాధి హామీ పథకాన్ని మరింత సమర్ధవంతంగా అమలు చేయాల్సిన ప్రభుత్వాలు, వాటిని నిర్వీర్యం చేయాలని చూడడం దుర్మార్గమన్నారు. అనేక ఉద్యమాలు పోరాటాలు చేసి వామపక్ష పార్టీలు ఒత్తిడితో సాధించుకున్న ఉపాధి హామీ చట్టాన్ని నిర్వీర్యం చేసే కేంద్రంలోని బిజెపి ప్రభుత్వ విధానాలను సమర్థవంతంగా తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. చట్టంలోని నిబంధన మేరకు పని కల్పించి, బడ్జెట్‌లో నిధులు కేటాయింపుతో ఉపాధి చట్టాన్ని పరిపుష్టి చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వరలక్ష్మి, ముసలయ్య, శ్రీను, రమేషు సముద్రాలు, ఎస్ రామ్ నాయుడు, నడుపూరు సన్యాసిరావు తదితరులు పాల్గొన్నారు

కశింకోట సచివాలయం వద్ద కూలీల ఆందోళన

**కశింకోట** : ఉపాధి హామీ పథకంలోని సమస్యలను పరిష్కరించి, సౌకర్యాలను కల్పించాలని కోరతుఊ మండలంలోని త్యేగాడ సచివాలయం వద్ద సిఐటియు ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. సచివాలయం సిబ్బందికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సిఐటియు నేతలు, ఉపాధి కూలీలు మాట్లాడుతూ జాబ్‌కార్డున్న కుటుంబానికి ఏటా 200 పని దినాలు కల్పించాలని, రోజుకు సగటున రూ.600 వేతనం ఇవ్వాలని, గునపాం, పార, గంపలు, తదితర పనిముట్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఉపాధి హామీ పథకానికి కేంద్రం ప్రభుత్వం బడ్జెట్లో నిధులు పెంచాలని డిమాండ్ చేశారు. గతంలో మాదిరిగా ఉపాధి హామీ కూలీలకు వేసవి అలవెన్స్ డబ్బులు ఇవ్వాలని కోరారు. కూలీలు వడదెబ్బకు గురికాకుండా పనిప్రదేశంలో టెంట్‌లు, తాగునీరు, మెడికల్ కిట్లు ఏర్పాటు చేయాలని కోరారు. కూలీలకు రెండు వారాల బకాయి వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేవారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా నాయకులు దాకారపు శ్రీనివాసరావు, హైమావతి, కె.వెంకటలక్ష్మి, వై.అప్పలనరస, కె.బుచ్చమ్మ, ఎం.నాగమణి, వి.సాంబ, వి.అప్పలనరస, ఎన్.దుర్గ, పి.చిన్నమ్ములు, కె.సన్యాసమ్మ, ఎం.ఈశ్వరమ్మ, ఎం.పైడిరత్నం, సి.హెచ్.చిన్న తల్లి, సిహెచ్.లోవతల్లి, కుకల చినలక్ష్మి, కుకల పెద్దలక్ష్మి పాల్గొన్నారు.

**రాంబిల్లి** : సిఐటియు, వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్రవ్యాప్త పిలుపులో భాగంగా పంచదార్ల గ్రామ సచివాలయం వద్ద తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ సిఐటియు ఆధ్వర్యంలో ఉపాధి కూలీలు ఆందోళన చేపట్టారు. సచివాలయ పంచాయితీ కార్యదర్శికి డిమాండ్లతో కూడిన వినతిపత్రం అందించారు.ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు జి దేముడునాయుడు మాట్లాడుతూ,. గతంలో వారం పనిచేస్తే ప్లేస్లిప్ ఇచ్చేవారని ఎంత కూలి వస్తుందో తెలిసేదని, ఇపుడు ఆదివారం కూడా పని

రాంబిల్లిలో పని ప్రదేశంలో ఉపాధి కూలీల నిరసన

చేయిస్తున్నారని, రోజుకు రూ.272 కూలి రాకపోవడం విడ్డూరమన్నారు. కేంద్ర బడ్జెట్‌లో నిధులు కోతపెట్టడంతోపాటు ఉన్న నిధుల్లో 40శాతం మెటీరియల్ కాంపోనెంట్ పనులు చేపట్టడంతో ఉపాధి పనిదినాలు తగ్గే పరిస్థితి ఉందని ఆవేదన వెలిబుచ్చారు. కార్యక్రమంలో సిఐటియు నేతలు చందక రామకృష్ణ, సిహెచ్.నూకన్న, ఉపాధి మేట్‌లు, కూలీలు పాల్గొన్నారు.

**ఉపాధి హామీ పనులు పాత పద్ధతిలోని కొనసాగించాలి.**

**కె.కోటపాడు** : గ్రామీణ ఉపాధి హామీ పథకం పనులు పాత పద్ధతిలోని కొనసాగించాలని ఎపి . వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కోశాధికారి గండి నాయనిబాబు, ప్రజా సంఘాల కన్వీనర్ ఎర్ర దేవుడు రైతు సంఘం మండల కార్యదర్శి వనము సూర్యనారాయణ డిమాండ్ చేశారు. ఎపి రైతు సంఘం పిలుపుమేరకు మండలంలోని కే కోటపాడు. ఏ కోడూరు. చౌటువాడ గ్రామాల్లో సచివాలయ సిబ్బందికి ఉపాధి కూలీల సమస్యలతో కూడిన వినత పత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ ఉపాధి కూలీలకు వేసవి అలవెన్స్ ఇవ్వాలని, పని చేసే చోట సౌకర్యాలు కల్పించాలని, ఉపాధి హామీ నిధులను భవనాలు, అభివృద్ధి పనులకు కేటాయించవద్దని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో గాడి ప్రసాదు. పల్ల శ్రీరాములు. దేవుడు బాబు పాల్గొన్నారు

చౌడువాడ సచివాలయంలో వినతిపత్రం ఇస్తున్న నాయనిబాబు

## ఎస్‌విడిఎస్‌కు జీవ వైవిధ్య అవార్డు

అవార్డు అందుకుంటున్న సంస్థ పిఆర్‌ఓ చైతన్య

**ప్రజాశక్తి -అనకాపల్లి** : అంతర్జాతీయ జీవవైవిధ్య దినోత్సవ సందర్భంగా పర్యావరణ పరిరక్షణఉ చేసిన కృషిని గుర్తిస్తూ శారదా వ్యాలీ డెవలప్‌మెంట్ సొసైటీ, ఎస్‌విడిఎస్‌సంస్థకు ఆంధ్రప్రదేశ్ జీవ వైవిధ్య మండలి అవార్డును అందజేసింది. మొక్కల పెంపకం, చిరుధాన్యాల సాగు అభివృద్ధికి చర్యలు, జీవవైవిధ్య పండుగలు, చెరువుల అభివృద్ధి, ప్రకృతి పరిరక్షణకు ప్రజా సంఘాలను భాగస్వాములను చేస్తూ చేపట్టే జీవవైవిధ్య పరిరక్షణ కార్యక్రమాలకు గుర్తింపుగా ఈ అవార్డు ఇచ్చినట్టు సంస్థ పిఆర్‌ఓ కర్రి చైతన్య తెలిపారు. జీవవైవిధ్య పరిరక్షణ దినోత్సవం సందర్భంగా తిరుపతిలో ఈ అవార్డు అందజేసారని తెలిపారు. ఈ సందర్భంగా సంస్థ కార్యదర్శి కె.జోగినాయుడు మాట్లాడుతూ ఈ అవార్డు తమపై మరింత బాధ్యతను పెంచిందని, మరిన్ని సేవా కార్యక్రమాలు గ్రామాల్లో విస్తృతం చేస్తామన్నారు. శారద వ్యాలీ డెవలప్మెంట్ సిబ్బంది, చిరుధాన్యాల చెల్లెళ్ల సంఘం, గ్రామ పెద్దలు, రైతు ఉత్పత్తిదారుల సంఘం సభ్యులు పాల్గొన్నారు..

## వాలంటీర్లకు సత్కారం

వాలంటీర్లను సత్కరిస్తున్న ఎంపిపి, జెడ్‌పిటిసి

**ప్రజాశక్తి- మునగపాక రూరల్:** ప్రజలకు, ప్రభుత్వానికి మధ్య వారధిగా ఉంటూ ఉత్తమ సేవలు అందించిన మండలంలోని అరబ్బుపాలెం, ఒంపోలు గ్రామాల సచివాలయ పరిధిలోని వాలంటీర్లను సోమవారం అరబ్బుపాలెం సచివాలయంలో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా నిర్వహించిన అభినందన సభలో ఎంపిపి మళ్ల జయలక్ష్మి, జెడ్‌పిటిసి స్వామి సత్యనారాయణ దుశ్శాలువాతో వాలంటీర్లను సత్కరించి, పురస్కారపత్రాలు, అందజేశారు. ఈ సందర్భంగా వారు చేసిన సేవలను కొనియాడారను. కార్యక్రమంలో వైసిపి మండల కన్వీనర్ ఆడారి గణపతి అచ్చంనాయుడు, సర్పంచ్ బొడ్డేడ శ్రీనివాసరావు, ఎంపిడిఓ రవికుమార్, ఇఓపిఆర్‌డి పి.ఈశ్వర రావు ,ఎంపిటిసి బొడ్డేడ బుజ్జి, వైసిపి నేత బద్ధపు శ్రీరామ మూర్తి, సచివాలయాల కన్వీనర్లు, గృహ సారధులు పాల్గొన్నారు.

## బల్లాకు విశిష్ట సేవారత్న పురస్కారం

బల్లా ను సత్కరిస్తున్న నిర్వాహకులు

**ప్రజాశక్తి -అనకాపల్లి** : విశాఖ ప్రతిభ క్రీడా,సాంస్కృతిక సంస్థ ఆధ్వర్యంలో సంస్థ 23వ వార్షికోత్సవం సందర్భంగా అనకాపల్లి సిద్ధార్థ సోషల్ సర్వీస్ అండ్ కల్చరల్ అసోసియేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు బల్ల నాగభూషణానికి ప్రతిభ సేవారత్న 2023 విశిష్ట సేవా పురస్కారం అందజేశారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథి దాడి సత్యనారాయణ మాట్లాడుతూ బల్లా నాగభూషణం తన సేవా సంస్థ ద్వారా 2004 నుంచి అనకాపల్లి కేంద్రంగా ఎన్నో వినూత్నమైన సామాజిక,సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తూ ప్రజల మన్ననలు పొందుతున్నారు. చేసిన సేవలకు గుర్తింపుగా అవార్డు అందుకున్న నాగభూషణాన్ని పలువురు అభినందించారు.

## విఆర్‌ఎల సమస్యలు పరిష్కరించాలి

డిఆర్‌ఒకు వినతిపత్రం ఇస్తున్న సిఐటియు నేతలు

**ప్రజాశక్తి- అనకాపల్లి** : విఆర్‌ఎల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద సోమవారం సిఐటియు ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు గనిశెట్టి సత్యనారాయణ మాట్లాడుతూ విఆర్‌ఎలకు కనీస వేతనం రూ.26,000 ఇవ్వాలని, అర్హతలనుబట్టి అటెండర్, చైన్‌మెన్, వాచ్‌మ్యాన్, డ్రైవర్, విఆర్‌ఓ పోస్టుల్లో విఆర్‌ఎలకు ప్రమోషన్లు ఇచ్చి భర్తీ చేయాలని గనిశెట్టి డిమాండ్ చేశారు. ఖాళీగా ఉన్న విఆర్‌ఎ పోస్టులను వారసులతో భర్తీ చేయాలని కోరారు. విఆర్‌ఎల డిమాండ్ల సాధనకు రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి వెంటనే చర్చలు జరపాలని డిమాండ్ చేశారు. అనంతరం డిమాండ్లతో కూడిన మెమోరాండంను డిఆర్‌ఓ వెంకటరమణకు అందజేశారు. దీనిపై డిఆర్‌ఓ స్పందిస్తూ, విఆర్‌ఎల సమస్యల వినతిపత్రాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళతానని హామీ ఇచ్చారు. అలాగే ఖాళీగా ఉన్న పోస్టులు భర్తీకి అన్ని తహశీల్దార్ కార్యాలయాల నుంచి వివరాలు రప్పిస్తామని, ప్రభుత్వం, ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు భర్తీ చేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో లావరాజు, సింహాచలం, సన్యాసిరావు, శేఖర్, వరప్రసాద్, కుమార్, రాము పాల్గొన్నారు.

## స్పందన అర్జీలకు సత్వర పరిష్కారం

### జిల్లా కలెక్టర్ రవిసుభాష్ పట్టన్ శెట్టి

**ప్రజాశక్తి -అనకాపల్లి** : స్పందనలో వచ్చిన దరఖాస్తులు ఫిర్యాదులను నిర్ణీత గడువులోగా తప్పక పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ రవిసుభాష్ పట్టన్ శెట్టి అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన స్పందన కార్యక్రమంలో ఆయన ప్రజల నుండి వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ దరఖాస్తుకు పరిష్కార చర్యలు ఇచ్చే క్రమంలో స్పష్టంగా, నిర్ణీత సమయం దాటకుండా జవాబులు పంపించాలన్నారు. కలెక్టర్‌తో పాటు జాయింట్ కలెక్టర్ ఎం. జాహ్నవి, జిల్లా రెవెన్యూ అధికారి పి.వెంకటరమణ దరఖాస్తులు ఫిర్యాదులు స్వీకరించారు. కాగా స్పందనలో 216 అర్జీలు వచ్చాయి. కార్యక్రమంలో జిల్లా అధికారులు అందరూ పాల్గొన్నారు.

**పోలీసు స్పందనకు 33 ఫిర్యాదులు....**

జిల్లా పోలీస్ కార్యాలయంలో సోమవారం

స్పందనలో అర్జీలు స్వీకరిస్తున్నకలెక్టర్, జెసి

నిర్వహించిన స్పందన కార్యక్రమానికి 33 ఫిర్యాదులు వచ్చాయి. ఎస్‌పి మురళీకృష్ణ మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా స్పందన నిర్వహిస్తున్నామన్నారు. ఫిర్యాదిదారుల నుంచి నేరుగా ఎస్‌పి అర్జీలను స్వీకరించి, ముఖాముఖీ వారి సమస్యలు తెలుసుకుని, సంబంధిత అధికారులకు చట్ట పరిధిలో పరిష్కారం కోసం ఆదేశించారు. అదనపు ఎస్‌పి విజయభాస్కర్ పాల్గొన్నారు.

## నేడు విద్యుత్ ఛార్జీల పెంపుపై ధర్నా

**ప్రజాశక్తి - బుచ్చయ్యపేట** : విద్యుత్ చార్జీలు పెంపు, విద్యుత్ కోతలను నిరసిస్తూ మంగళవారం వడ్డాది విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద ఆందోళన చేపట్టనున్నట్లు బుచ్చయ్యపేట మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు గోకివాడ కోటేశ్వరరావు సోమవారం తెలిపారు. ధర్నా కార్యక్రమంలో అధికసంఖ్యలో ప్రజలు, బాధిత విద్యుత్ వినియోగదారులతోపాటు టిడిపి శ్రేణులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

## 'ఇదేం ఖర్మ' అర్జీల నివేదన

**ప్రజాశక్తి -వడ్డాది :** సమస్యలను పరిష్కరించే దిక్కే లేక, అభివృద్ధి కానరాక రాష్ట్రంలో అవినీతి, అక్రమాలతో కూడిన అరాచక పాలన సాగుతోందని టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి బత్తుల తాతయ్యబాబు అన్నారు. ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి కార్యక్రమంలో భాగంగా చోడవరం నియోజకవర్గంలో గుర్తించిన సమస్యలను టిడిపి జిల్లాకమిటీ ద్వారా పార్టీరాష్ట్రకార్యాలయానికి పంపిస్తున్నట్లు తెలిపారు. సోమవారం వడ్డాదిలో స్థానిక విలేకరులతో మాట్లాడారు. ఇదేం ఖర్మ కార్యక్రమంలో భాగంగా నియోజకవర్గ పరిధిలోని నాలుగు మండలాల్లో సుమారు 30 వేల కుటుంబాలను కలిసామన్నారు. ప్రధానంగా రోడ్లు, విద్యుత్తు నిత్యవసర ధరల పెరుగుదల, రైతులకు గిట్టుబాటు ధరలు లేకపోవడం, మద్యం, ఇసుక మాఫియా అవినీతి, గ్రామాల్లో అభివృద్ధి నిలిచిపోవడం వంటి సమస్యలను గుర్తించామన్నారు. సేకరించిన ప్రజాభిప్రాయ ఫారాలను జిల్లా కమిటీకి పంపించారు. టిడిపి నేతలు జికోటేశ్వరరావు, డి అప్పల నాయుడు, కిషోర్, గొలగాని రాజారావు, బంటు శ్రీను, మద్రివలస సర్పంచ్ ఎలిశెట్టి జోగపాత్రుడు, దొండా నరేష్ పాల్గొన్నారు,

## ఇంటి పన్ను రశీదుల అందజేత

ఇంటి పన్ను రశీదులు అందజేస్తున్న పంచాయతీ ఇఒ

**ప్రజాశక్తి- చోడవరం:**చోడవరం పంచాయతీ ఎడ్ల వీధిలో ఎన్నో ఏళ్లగా నివాసం ఉంటున్న పేదల ఇళ్లకు ఇంటి పన్ను రశీదులను సోమవారం పంచాయతీ ఇఒ నారాయణరావుతో కలిసి స్థానిక నాయకులు అందజేశారు. ఈనెల 7న స్థానిక ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ ఆధ్వర్యంలో పట్టణంలో ఉన్న పేదలందరికీ తమ నివాస స్థలాల్లో హక్కు కల్పించేందుకు పంచాయతీ ద్వారా ఇంటి పన్ను రశీదులను పంపిణి చేశారు. మిగతా వారికి పంచాయతీ సర్పంచ్, సభ్యులతో కలిసి పంచాయతీ సిబ్బంది రశీదులను అందించారుకార్యక్రమంలో మార్కెట్ కమిటీ ఛైర్మన్ వైవి సత్యారావు సర్పంచ్ బండిశ్రీను, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ ఓరుగంటి నెహ్రూబాబు, వార్డు సభ్యురాలు ఓరుగంటి నాగమణి పాల్గొన్నారు

## 102 మందికి కంటి పరీక్షలు

**ప్రజాశక్తి -బుచ్చయ్యపేట :** మండలంలో గల కెపి అగ్రహారంలో సోమవారం వైఎస్ఆర్ కంటివెలుగు కార్యక్రమంలో భాగంగా 102మందికి కంటి వైద్య పరీక్షలను నిర్వహించారు. నేత్ర వైద్యనిపుణులు ఆర్. వెంకటరావు ఆకుకూరలు అధికంగా తీసుకోవడం ద్వారాగా కంటి ఆరోగ్యాన్ని సంరక్షించుకోవచ్చునన్నారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి ఇంటికి వైద్య పరీక్షలు నిర్వహించారు. 20 మందికి కంటి ఆపరేషన్ అవసరమని గుర్తించారు. వారికి ప్రభుత్వపరంగా ఉచితంగా ఆపరేషన్ చేయిస్తామన్నారు. మరో 22 మందికి కంటి అద్దాలు అవసరమని గుర్తించారు కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ గోపిశెట్టి శ్రీనివాసరావు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

## ఫిట్‌నెస్ సెంటర్ ప్రారంభం



ఫిట్‌నెస్ సెంటర్‌ను ప్రారంభిస్తున్న సతీష్

**ప్రజాశక్తి-అనకాపల్లి :**మండలంలోని కూండ్రం గ్రామంలో హనుమాన్ ఫిట్‌నెస్ సెంటర్‌ను సోమవారం ముత్యాల గార్మెంట్స్ అధినేత ముత్యాల వెంకటేశ్వరరావు తనయుడు సతీష్ ప్రారంభించారు. ఈ సందర్భంగా సతీష్ మాట్లాడుతూ యువత ఆరోగ్యంపై దృష్టి పెట్టాలని సూచించారు. చెడు అలవాట్లక దూరంగా ఉండి, నిత్యం వ్యాయామం చేయడం ద్వారా శారీరక, మానసిక ఆరోగ్యం పొందవచ్చన్నారు. కార్యక్రమంలో ఎం చిన్నారావు, ఎల్.శేషు కుమార్, కె.అమరేంద్ర కుమార్, ఎస్. దేవుళ్ల నాయుడుః, ఎంవిఆర్ యువసేన సభ్యులు పాల్గొన్నారు.

# రాంకీ యాజమాన్యంపై చర్యలు తీసుకోండి

కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తున్న గనిశెట్టి

**ప్రజాశక్తి - పరవాడ:** అధికారులు, కలెక్టర్ ఆదేశాలను బేఖాతరు చేస్తూ మండలంలోని ఫార్మాసిటీలో రాంకీ యాజమాన్యం అక్రమంగా చెరువుల తవ్వకాలను కొనసాగిస్తోందని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షుడు గనిశెట్టి సత్యనారాయణ మరోమారు జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. రాంకీ ఫార్మా తవ్వకాలు సాగిస్తున్న చెరువులను మూసివేయాలని గతంలో ఫిర్యాదు మేరకు కలెక్టర్ చర్యలు తీసుకొని చెరువులు తవ్వకాలను నిలుపుదల చేశారన్నారు. కానీ రాంకీ యాజమాన్యం ఆదేశాలను బేఖాతరు చేస్తూ, మరోసారి మహి డ్రగ్స్ పక్కన ఖాళీస్థలంలో చెరువు, కాలువలు, తవ్వకాలను చేపట్టింది. గ్రీన్ బెల్ట్, బఫర్ జోన్ నిబంధనలు ఉల్లంఘిస్తున్న రాంకీ యాజమాన్యంపై విచారణ చేసి చర్యలు తీసుకోవాలని కోరారు. తానాం, తాడి, బొద్దుపువానిపాలెం, గౌతు లచ్చన్న కాలనీ, గోర్లివానిపాలెం, పరవాడ గ్రామాలు రెండు కిలోమీటర్ల లోపే ఉన్నాయని దీనివల్ల భూగర్భ జలాలు నాశనం అవుతాయని, పర్యావరణం దెబ్బతింటుందని ఆవేదన వ్యక్తం చేశారు. రాంకీ యాజమాన్యం తీరుపై వెంటనే విచారణ చేసి చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌ను కోరారు.

# అక్రమ కేసులతో వేధించడం తగదు

### ఆర్‌డిఒ కార్యాలయం వద్ద ఆటో డ్రైవర్ల ధర్నా.. వినతిపత్రం అందజేత

ఆర్‌డిఒ కార్యాలయం వద్ద ఆందోళన చేస్తున్న ఆటో డ్రైవర్లు

**ప్రజాశక్తి- అనకాపల్లి :** ఆటో డ్రైవర్లపై ఆర్థిక భారాలు వేస్తున్న పోలీసులు, రవాణాశాఖాధికారుల ఇ-చలానాలు రద్దుచేయాలని ఎపి ఆటో డ్రైవర్స్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ (ఎఐటియుసి) అనకాపల్లి జిల్లా కన్వీనర్ కోన లక్ష్మణ డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక ఆర్‌డిఒ కార్యాలయం వద్ద ఆటో డ్రైవర్లు నిరసన ధర్నా చేపట్టారు ఆర్‌డిఒ చిన్నికృష్ణకు వినతిపత్రం అందజేశారు.

ధర్నానుద్దేశించి లక్ష్మణ మాట్లాడుతూ పెరిగిన డీజిల్, పెట్రోల్, నిత్యావసర వస్తువుల ధరలతో ఆర్థిక ఇబ్బందులతో ఉన్న ఆటో డ్రైవర్లపై ప్రభుత్వం కన్నెర్ర చేయడం తగదన్నారు. వాహన మిత్ర పేరుతో రూ.10 వేలు ఇచ్చి, ఇలా పోలీస్ ఇ- చలానాలు, రవాణా శాఖ అధికారులు పెట్టిన అక్రమ కేసులతో ఏడాదికి సగటున ఒక్కో ఆటో డ్రైవర్ నుంచి రూ.50వేలు గుంజుకోవడం దుర్మార్గమని మండిపడ్డారు. డ్రైవర్లపై ఆర్థిక భారాలు వేస్తూ విడుదల చేసిన జిఒ 21, లారీలు, బస్సులు, వ్యాన్లు, కార్లపై 25 నుంచి 30 శాతం పన్నులు పెంచుతూ విడుదల చేసిన జిఒ 31ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. భారీగా పెంచిన టోల్ ప్లాజా ఫీజులను, డీజిల్, పెట్రోలు వంట గ్యాస్, నిత్యవసర వస్తువుల ధరలను తగ్గించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఆందోళన చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా కన్వీనర్ వై. ఎన్. భద్రం,నాయకులు శ్రీరామ దాసు అబ్బులు, ఆటో సంఘం నాయకులు ఒమ్మి సైదులు, పెద్దిరెడ్ల నాగేశ్వర

# 25న రాష్ట్ర మహాసభను విజయవంతం చేయండి

అనకాపల్లిలో ప్రచారం చేస్తున్న సంఘం నేతలు

**ప్రజాశక్తి-అనకాపల్లి :** ఈనెల 25న జరిగే అఖిల భారత వ్యవసాయ గ్రామీణ కార్మిక సంఘ రాష్ట్ర మహాసభను విజయవంతం చేయాలని జాతీయ ఉపాధ్యక్షుడు బుగతా బంగారురావు పిలుపునిచ్చారు. ఈ మేరకు పట్టణంలో ప్రచారజాతా నిర్వహించారు. ఈ సందర్భంగా బంగారురావు మాట్లాడుతూ కేంద్రంలోని మోడీ సర్కార్ తీసుకు వస్తున్న గ్రామీణ, పట్టణ, నగర కార్మిక వ్యతిరేక చట్టాలను తక్షణం రద్దు చేయాలని డిమాండ్ చేశారు. గ్రామీణ పేదలకు పని కల్పించే ఉపాధి హామీ పథకాన్ని మోడీ సర్కార్ పనిగట్టుకుని లేనిపోని ఆంక్షలతోపాటు, సరైన కూలిగిట్టుబాటుకాని పరిస్థితులను కల్పించి నిర్వీర్యం చేస్తోందని విమర్శించారు. ప్రపంచ వ్యాప్తంగా కార్మికులు పోరాడి సాధించుకున్న ఎనిమిది గంటల పని దినం హక్కును మోడీ సర్కార్ రద్దుచేసి దానిని 12 గంటలకు మారిస్తే రాష్ట్రంలోని ఏ రాజకీయ పార్టీ కూడా దీనిపై ప్రశ్నించలేదని ఖండించలేదనిఆందోళన వ్యక్తం చేశారు. అంతర్జాతీయ కార్మిక సంఘం ఒప్పందానికి మోడీ సర్కార్ తూట్లు పొడుస్తుందన్నారు.

అఖిలభారత వ్యవసాయ గ్రామీణ కార్మిక సంఘం జాతీయ కార్యదర్శి, అజయ్ కుమార్, మాట్లాడుతూ అనకాపల్లిలో జరుగుతున్న సంఘం రాష్ట్ర మహాసభకు జాతీయ అధ్యక్షులు బీహార్ శాసనసభ సిపిఐఎంఎల్ లిబరేషన్ పార్టీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ సత్యదేవరామ్, సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి ధీరేంద్రజ హాజరవుతున్నారన్నారు. సంఘం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు జనార్ధన్, మానుకొండ లచ్చుబాబు, ఎస్ గణేష్ పాల్గొన్నారు.

# అమలుకాని మెనూపై ఎంపిపి అసంతృప్తి

అంగన్వాడీ కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న ఎంపిపి సూరిబాబు

**ప్రజాశక్తి -అనకాపల్లి :** అంగన్వాడి కేంద్రాల్లో రికార్డులను ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేయాలని మండల పరిషత్ అధ్యక్షులు గొర్లి సూరిబాబు ఆదేశించారు. సోమవారం మండలంలోని సంపతిపురం సచివాలయ పరిధిలో టీ వెంకుపాలెం అంగన్వాడీ కేంద్రాన్ని ఆకస్మిక తనిఖీ చేశారు. మెనూ సక్రమంగా అమలు చేయలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. అంగన్వాడీ రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించి అప్డేట్ చెయ్యకపోవడం చూసి ఎప్పటికప్పుడు రికార్డులను మెయింటైన్ చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపిడిఒ కే ధర్మారావు, ఎసిడిపిఒ శశికళ, ఏఈ కుమార్ రాజా, సంపతిపురం వైసిపి నేతలు పల్లా శ్రీనివాసరావు ,భర్నికాన రాము, పోతల శేఖర్, గోకివాడ నాగ అప్పారావు పాల్గొన్నారు.

## బాలికపై లైంగిక దాడి కేసులో నిందితునికి 20 ఏళ్ల జైలు

### - రూ. 5 వేల జరిమానా

**ప్రజాశక్తి -అనకాపల్లి :** గత ఏడాది ఏడు సంవత్సరాల బాలికపై లైంగిక దాడికి పాల్పడిన కేసులో ముద్దాయికి 20 ఏళ్ల జైలు శిక్ష, ఐదు వేల రూపాయల జరిమానా విధిస్తూ కోర్టు తీర్పు వెలువరించిందని ఎస్‌పి మురళీకృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. కేసుకు సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. గత ఏడాది మే 8వ తేదీన చోడవరం మండలం బెన్నవరం గ్రామానికి చెందిన ఏడేళ్ల బాలికపై అదే గ్రామానికి చెందిన ఒక వ్యక్తి లైంగిక దాడికి పాల్పడ్డాడు. దీనిపై చోడవరం పోలీస్ స్టేషన్లో కేసు నమోదు చేయగా దిశ డిఎస్‌పి ఎం మహేశ్వరరావు దర్యాప్తు ప్రారంభించారు. విశాఖపట్నం ఫోక్సో కేసులను విచారించు ప్రత్యేక న్యాయస్థానంలో కేసు విచారణ పూర్తయిన తర్వాత ఈనెల 22న తీర్పు వెలువరించింది. కేసు నేరం నిర్ధారణ కావడంతో ముద్దాయికి 20 ఏళ్లు జైలు శిక్ష, ఐదువేల రూపాయల జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పు చెప్పారు. జరిమానా చెల్లించకుంటే రెండు నెలల సాధారణ జైలు శిక్ష అనుభవించాలని తీర్పులో పేర్కొనానరు. . తదుపరి ఆర్డర్ అందిన 30 రోజుల్లోగా బాధితురాలికి లక్ష రూపాయల నష్టపరిహారం చెల్లించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోర్టు ఆదేశించింది. ఈ కేసును ప్రత్యేక పబ్లిక్ ప్రాసిక్యూటర్ కె.కృష్ణ వాదించారు. విచారణ ప్రక్రియను ఎస్‌పి మురళీకష్ణ పర్యవేక్షించారు. దర్యాప్తుకు సహకరించిన అందరిని ఎస్‌పి అభినందించారు.

## ఇళ్లు .. భూమి లేవట..!

### మంత్రి అమర్ వ్యాఖ్యలు విడ్డూరం : బుద్ధ

**ప్రజాశక్తి-అనకాపల్లి :** జగన్ రెడ్డికి ఇల్లు లేదు, తనకు సెంటు భూమి లేదని మంత్రి అమర్‌నాథ్ చెప్పడం విడ్డూరంగా ఉందని టిడిపి జిల్లా అధ్యక్షులు మాజీ ఎమ్మెల్సీ బుద్ధ నాగ జగదీశ్వరరావు ఎద్దేవా చేశారు. సోమవారం స్థానిక పార్లమెంటరీ పార్టీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ, తల్లికి చెల్లికి వెన్నుపోటు పొడిచి ఆంధ్రప్రదేశ్ నుండి తరిమేసిన జగన్‌రెడ్డిని వెనకేసుకొస్తూ, వెన్నుపోట్లు గురించి వైసిపి నేతలు మాట్లాడడం హాస్యాస్పదమన్నారు. తుమ్మపాల సుగర్స్ ఆధునికీకరణ హామీని మంత్రి అమర్ మరిచారన్నారు. విస్సన్నపేట భూకుంభకోణంలో ఆర్‌డిఒ విచారణ డిమాండ్ చేసిన మంత్రి అమర్, ఇపుడు నివేదిక ఎందుకు బయటపెట్టడం లేదని ప్రశ్నించారు. ముస్లిం మైనార్టీ సెల్ జిల్లా అధ్యక్షులు షేక్ బాబర్, పట్టణ శాఖ ప్రధాన కార్యదర్శి కోట్ని రామకృష్ణ పాల్గొన్నారు.

## ఉద్యోగ, ఉపాధి కల్పనలో నయవంచన

**ప్రజాశక్తి-అనకాపల్లి :** ఉద్యోగం, ఉపాధి కల్పించకుండా నిరుద్యోగులను కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు మోసం చేస్తున్నాయని ఎఐవైఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి మహంకాళి సుబ్బారావు విమర్శించారు. సోమవారం స్థానిక కోడుగంటి గోవిందరావు భవనంలో జిల్లా ప్రధాన కార్యదర్శి వియ్యపు రాజు అధ్యక్షతన ముఖ్య నాయకులతో సమావేశం జరిగింది. ఈ సందర్భంగా మాట్లాడుతూ అధికారంలోకి వచ్చిన వెంటనే నిరుద్యోగ సమస్య పరిష్కరిస్తామని చెప్పిన నరేంద్ర మోడీ. జగన్మోహన్ రెడ్డి నేడు ఉద్యోగ ఉపాధి మాటే మరిచారన్నారు. మెగా డిఎస్‌సి ద్వారా 50వేలు ఉపాధ్యాయ పోస్టులు భర్తీ చేయాలని, గ్రూప్ 1,2 ఉద్యోగాలు పెంచాలని కోరారు. విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ ఆలోచనను విరమించుకోవాలని డిమాండ్ చేశారు రాష్ట్రానికి నూతన పరిశ్రమలు తీసుకొచ్చి ఉద్యోగ అవకాశాలు కల్పిస్తానన్న జగన్ ఎన్ని పరిశ్రమలు తీసుకొచ్చారో చెప్పాలని డిమాండ్ చేశారు. ఏటా జాబ్ క్యాలెండర్లు విడుదల, వేలల్లో ఖాళీగా ఉన్న ఉద్యోగాలన్నీ భర్తీ చేస్తామన్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల హామీలన్నీ అమలు చేయాలని డిమాండ్ చేశారు. నిరుద్యోగుల పట్ల సిఎం జగన్ వైఖరి మార్చు కోవాలని హెచ్చరించారు. ఎఐవైఎఫ్ నాయకులు రాధాకృష్ణ, బాలరాజు, భరత్,రాంబాబు, గణేష్, చైతన్య, శ్యామ్ పాల్గొన్నారు.

## శ్రీధర్‌కు రాష్ట్ర జీవ వైవిధ్య సంరక్షణ అవార్డు

**ప్రజాశక్తి -అనకాపల్లి :** అంతర్జాతీయ జీవ వైవిధ్య దినోత్సవం సందర్భంగా ఎపి జీవ వైవిధ్య మండలి ఆధ్వర్యంలో తిరుపతి శ్రీ వెంకటేశ్వర వెటర్నరీ యూనివర్సిటీ ఆడిటోరియంలో సోమవారం నిర్వహించిన వేడుకలో ంది. అనకాపల్లికి చెందిన జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత, వృక్షమిత్ర అవార్డు గ్రహీత కొణతాల ఫణి భూషణ్ శ్రీధర్ మాస్టారుకు జీవ వైవిధ్య సంరక్షణ -2023 అవార్డును అందజేశారు. రాష్ట్ర అటవీ శాఖ మంత్రి పెద్ద రెడ్డి రామచంద్రారెడ్డి నుంచి అవార్డు అందుకున్న శ్రీధర్ మాస్టార్‌ను పట్టణానికి చెందిన పలువురు ప్రముఖులు, స్వచ్ఛంద సంస్థలు అభినందించాయి.

అందజేస్తున్న ఉప ముఖ్యమంత్రి బూడి

## ఉత్తర్వుల అందజేత

**ప్రజాశక్తి-మాడుగుల:** ప్రభుత్వ డిగ్రీ కళాశాలను స్థానిక వసతి గృహంలో ఏర్పాటు చేసేందుకు జిల్లా కలెక్టర్ ఉత్తర్వులను ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు సోమవారం కళాశాల ప్రిన్సిపాల్ కు అందజేశారు. డిగ్రీ కళాశాలకు సొంత భవనం లేక పోవడంతో ఇన్నాళ్లు జూనియర్ కళాశాలలోనే నిర్వహించేవారు. దీంతో ఉపముఖ్యమంత్రి చొరవతో జిల్లా పరిషత్ హైస్కూల్ మైదానంలో నిర్మించిన బాలికల వసతిగృహంలోకి కళాశాలను మార్చారు. దీంతో ఆయన ఉత్తర్వులను కళాశాల ప్రిన్సిపల్ శాస్త్రికు అందజేశారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్ ఉప ముఖ్యమంత్రికి కళాశాల చైర్మన్ శ్రీనాథ్ శ్రీనివాసరావుకు, ఎంపీపీ పెదబాబుకు తరగతుల సమస్య పరిష్కరించిన గ్రామ నేతలు, ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఓఎస్‌డి పోలినాయుడు, వైస్ ఎంపీపీ రాజారామ్, బొమ్మిశెట్టి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

పరిశీలిస్తున్న తహసీల్దార్ మహేశ్వరరావు

## రోడ్డు పనులపై ఆరా

**ప్రజాశక్తి-కొత్తకోట:**రావికమతం మండలం కొత్తకోటలో శివాలయం వీధి రహదారికి ప్రత్యామ్నాయంగా వేస్తున్న రహదారిని తహసీల్దార్ మహేశ్వరరావు సోమవారం పరిశీలించారు. స్థానిక పాత పిహెచ్సీ, 1వ వార్డుల నుంచి మూడు వార్డుల ప్రజల ఉపయోగపడే ఈ రహదారిని వేసేందుకు రెండు రోజులు క్రితం ప్రారంబించారు.రహదారి పక్కనున్న కొంత మంది రైతులు అభ్యరతరం తెలపడంతో పనులు ఆగాయి. దీంతో, తహసీల్దార్ ఆ రహదారిని సోమవారం పరిశీలించారు. అభ్యంతరం తెలిపే వారు తమ వద్దనున్న పత్రాలతో కలవాలని సూచించారు. సమగ్ర సర్వే నిర్వహించి నివేదిక ఇవ్వాలని గ్రామ సర్వేయర్ ను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ చిన్నబాయి, సర్పంచ్ కొన లోవరాజు, ఉపసర్పంచ్ పందల దేవ, పాల్గొన్నారు.

# ల్యాండ్ పూలింగ్ నిర్వాసితుల సమస్య పరిష్కరిస్తా

### మాజీమంత్రి దాడి వీరభద్రరావు

**ప్రజాశక్తి -అనకాపల్లి :** అనకాపల్లి చెర్లోపలి ఆవఖండం జిరాయితీ భూముల ల్యాండ్‌పూలింగ్ నిర్వాసితుల సమస్యను ప్రభుత్వం త్వరలో పరిష్కారం చేస్తుందని అనకాపల్లి వ్యవసాయదారుల సంఘం అధ్యక్షులు మాజీమంత్రి దాడి వీరభద్రరావు వెల్లడించారు. సోమవారం. స్థానిక రైతు భారతి ఆడిటోరియంలో సంబంధిత రైతులతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతూ, గడచిన 16ఏళు గా పెండింగ్లో ఉన్న సమస్యను పరిష్కరించి తమకు న్యాయం చేయాలని రైతులు కోరారు. దీనిపై స్పందిస్తూ, రైతులనుద్దేశించి దాడి వీరభద్రరావు మాట్లాడుతూ కొందరు వుడా అధికారులు నిర్లక్ష్య వైఖరి వలన ఈ ప్రాజెక్టుకు అంతరాయం కలిగిందన్నారు. 16 ఏళ్ల కిందట జిరాయితీ రైతులు 50 ఎకరాల భూమిని డెవలప్మెంట్ నిమిత్తం వుడాకు జిపిఎ రిజిస్ట్రేషన్ చేసి అప్పగించారని, ఈ భూములను స్వాధీనం చేసుకొని లేఅవుట్ అభివద్ధి పనులకు సుమారు రూ. రెండు కోట్లను ఖర్చు చేశారన్నారు. ఆ పరిస్థితుల్లో వైస్ చైర్మన్ కోటేశ్వరరావు వచ్చి ప్రాజెక్టును నిలుపు చేశారన్నారు. ప్రభుత్వ అనుమతులు లేకుండా ఈ ప్రాజెక్టును చేపట్టారని పాత అధికారులను నిందించారన్నారు. బాధ్యత రహితమైన అతని అభ్యంతరాల వలన రైతులు తీవ్రంగా నష్టపోయారని తెలిపారు.

ప్రాజెక్టు ఆగిపోయిన నేపథ్యంలో తమ భూములను రైతులకు తిరిగి ఇచ్చేయగలరా అని దాడి వీరభద్రరావు వుడా వైస్ చైర్మన్‌ను ప్రశ్నించగా సరైన చర్యలు తీసుకోలేదనాన్నరు. తర్వాత వచ్చిన వైస్ చైర్మన్ రామిరెడ్డికి సమస్యలను వివరించగా, ఈ ప్రాజెక్టు వలన రైతులు, వుడాకు కలిగే ప్రయోజనాలను వివరిస్తూ,అనుమతులు

మాట్లాడుతున్న దాడి వీరభద్రరావు

ఇవ్వాలని ప్రభుత్వానికి 18 నెలలు కిందట నివేదిక పంపారన్నారు. దీనిపై పట్టణ అభివద్ధి శాఖ అధికారులు ఇంతవవరకు అనుమతిని గాని వివరణ గాని ఇవ్వలేదన్నారు. ఈ నేపథ్యంలో సమస్యలను వైసిపి ఉత్తరాంధ్ర రీజినల్ కోఆర్డినేటర్ వైవి.సుబ్బారెడ్డి ద్వారా ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని దాడి వీరభద్రరావు రైతులకు హామీ ఇచ్చారు.ఈ సందర్భంగా ప్రాజెక్టు నిర్వహణ కార్యవర్గ సభ్యులుగా కొణతాల నీలిమ భాస్కర్‌రావు, బుద్ధ రమణాజీ, పెంటకోట సూర్యప్రకాశరావు, మల్ల బాపునాయుడు, కొణతాల పవన్, కొణతాల సూర్యనారాయణ ,కాండ్రేగుల శ్రీనివాసరావులను ఎన్నుకున్నారు. సమావేశంలో రైతు సంఘం నాయకులు విల్లూరి రాము, బుద్ధ రమణాజీ, కొణతాల నీలిమభాస్కర్, అప్పారావు, కర్రి దివాకర్ రావు, బుద్ధ బాపు నాయుడు, పెంటకోట సూర్యప్రకాశరావు పాల్గొన్నారు.

# పథకాలు ప్రజలకు అందాలి

### ఎమ్మెల్యే బాబూరావు

**ప్రజాశక్తి -నక్కపల్లి:** ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు ప్రజలకు అందజేయడంలో వాలంటీర్లు కీలక పాత్ర పోషిస్తున్నారని ఎమ్మెల్యే గొల్ల బాబురావు అన్నారు .మండల పరిషత్ కార్యాలయం ఆవరణంలో సోమవారం సాయంత్రం వాలంటీర్ల వందనం కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే గొల్ల బాబురావు వాలంటీర్లను సన్మానించి, ప్రశంసా పత్రాలను అందజేశారు .ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ప్రజల ముంగిటకు సంక్షేమ పథకాలు అందించాలన్న లక్ష్యంతో సచివాలయ వ్యవస్థను తీసుకురావడం జరిగిందన్నారు. వాలంటీర్లు బాధ్యతగా విధులు నిర్వహించి మరింతగా సేవలను ప్రజలకు అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కాపు కార్పొరేషన్ డైరెక్టర్ వీసం రామకృష్ణ, ఎంపీపీ రత్నం, జడ్పిటిసి సభ్యురాలు కాసులమ్మ, ఎంపీడీవో సీతారామరాజు, తహసీల్దార్ నీరజ, మండల పరిషత్ ఉపాధ్యక్షులు వీసం నానాజీ ,వెలగా ఈశ్వరరావు ,వైసిపి నాయకులు శీరం నరసింహమూర్తి పాల్గొన్నారు.

వాలంటీర్‌కు పురస్కారాన్ని అందజేస్తున్న ఎమ్మెల్యే బాబురావు

ఆందోళన చేస్తున్న ఆదివాసీలు

## ఆదివాసీల ఆందోళన

**ప్రజాశక్తి -కొత్తకోట:**రావికమతం మండలం చీమల పాడు శివారు కళ్యాణపులోవ రిజర్వాయర్ పరీవాహక ప్రాతంలో నూతన మైనింగ్‌లకు అనుమతులు ఇవ్వవద్దని చీమలపాడు పంచాయతీ శివారు ఆదివాసీ గ్రామాల ప్రజలు, అఖిల భారత వ్యవసాయ గ్రామీణ కార్మిక సంఘం ప్రతినిదులు సోమవారం రావికమతం తహసీల్దార్ కార్యాలయం వద్ద ఆందోళన చేశారు. ఈ సందర్భంగా ఆదివాసీలు మాట్లాడుతూ, గతంలో ఉన్న మైనింగ్ కంపెనీలతో రిజర్వాయర్ ఉనికికి ప్రమాదం ఏర్పడిందని, దీనిపై ఎన్నో పోరాటాలు చేశామన్నారు. కొత్తగా మరో కంపెనీకి అనుమతులిచ్చేందుకు అధికార్లు ప్రయత్నిస్తున్నారని తెలిపారు. తాటిపర్తి, ఆజేయపురం, కడగెడ్డ తదితర గ్రామాలలో ప్రజలకు మార్చి, ఏప్రిల్ నెలలకు సంబందించి రేషన్ అందలేదని అధికార్లు వచ్చి విచారణ చేశారని, ఇప్పటికీ రేషన్ ఇవ్వలేదని పేర్కొన్నారు. అధికార్లు తక్షణం చర్యలు చేపట్టాలని ఆ సంఘ నాయకులు మోసూరి రాజిబాబు, సెగ్గె నానిబాబు, పెదరాజు, ఆదివాసీలు కోరారు.

## గృహ నిర్మాణ సమస్యలు తెలపాలి

### - హౌసింగ్ ఎఇ రాజు

**ప్రజాశక్తి -నక్కపల్లి:**జగనన్న కాలనీలో గృహ నిర్మాణాలకు సంబంధించి ఇబ్బందులు ఉంటే తమ దృష్టికి తీసుకువస్తే సత్వరం పరిష్కారానికి కృషి చేస్తామని హౌసింగ్ ఏఈ డిఎ రాజు తెలిపారు. సోమవారం విలేకరులతో మాట్లాడుతూ, మండలంలో జగనన్న ఇళ్ల కాలనీలకు సంబంధించి, సొంత స్థలాల్లో గృహాలు నిర్మించుకునే వారికి ఎటువంటి సమస్యలు ఉన్నా మండల స్థాయిలో పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. హౌసింగ్ మెటీరియల్, పెండింగ్‌లో బిల్లులు, లే అవుట్లలో ఉన్న ఇతర సమస్యలను గ్రామ సచివాలయ ఇంజనీరింగ్ అసిస్టెంట్లకు తెలియజేయాలని ఆయన సూచించారు. లేని పక్షంలో మండల ఏఈ కార్యాలయంలో కూడా సంప్రదించవచ్చుని, తమ పరిధిలో పరిష్కారమయ్యే సమస్యలను వెను వెంటనే పరిష్కరిస్తామన్నారు. తమ పరిధిలో లేని సమస్యలు ఉంటే వాటిని గుర్తించి జిల్లాస్థాయి అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ప్రతి సోమవారం గ్రామ, మండల స్థాయిలో నిర్వహించే స్పందన కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు .

అవగాహన కల్పిస్తున్న ఆచార్యులు

## కొనసాగిన వేసవి శిబిరాలు

**ప్రజాశక్తి-నక్కపల్లి:**మొక్కలతో పర్యావరణం పరిరక్షించబడుతుందని నక్కపల్లి హైస్కూల్ తెలుగు ఉపాధ్యాయులు ఎన్‌విఎస్ ఆచార్యులు అన్నారు .గ్రంథాలయ అధికారి జనార్దన్ ఆధ్వర్యంలో వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా సోమవారం అంతర్జాతీయ జీవ వైవిద్య దినోత్సవం సందర్భంగా తెలుగు ఉపాధ్యాయులు ఎన్‌విఎస్ ఆచార్యులు జీవవైవిధ్యం పరిరక్షణ పై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ప్రతీ ఒక్కరు మొక్కలను నాటడంతో పాటు వాటిని సంరక్షించే భాద్యత తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు అప్పలరాజు తదితరులు పాల్గొన్నారు.

**సబ్బవరం.** : స్థానిక శాఖా గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరం కార్యక్రమంలో భాగంగా సోమవారం ఉదయం గ్రంథాలయం అధికారి వి శిరీష పర్యవేక్షణలో పలు పాఠశాల విద్యార్థులుకు పేపర్ రీడింగ్, నీతి కథలు చెప్పడంపై శిక్షణ ఇచ్చారు.ఈ సందర్భంగా వి శిరీష మాట్లాడుతూ విద్యార్థుల విజ్ఞానానికి పేపర్ రీడింగ్ తోడ్పడుతుందన్నారు.

# గుర్రపువాతం వ్యాధిపై అవగాహన ర్యాలీ

గొడిచెర్లలో ర్యాలీ చేపడుతున్న సిబ్బంది

**ప్రజాశక్తి-నక్కపల్లి:**మండలంలోని గొడిచెర్ల గ్రామంలో సోమవారం పిహెచ్‌సి వైద్యాధికారి కిషోర్ కుమార్, సుకన్య ఆధ్వర్యంలో ప్రపంచ ఎంక్లాంప్సియా దినోత్సవం సందర్భంగా వైద్య ఆరోగ్య సిబ్బంది ర్యాలీ నిర్వహించారు. ఎంక్లాంప్సియా (గుర్రపు వాతం ) వచ్చే వ్యాధి, నివారణ చర్యలు పై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో వైద్య ఆరోగ్య సిబ్బంది ప్రసాద్, కుమారి, రామకృష్ణ, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

**గొలుగొండ:** మండలంలో కృష్ణ దేవి పేట పి హెచ్ సి ఆధ్వర్యంలో గర్భిణీలకు ఆరోగ్యంపై అవగాహన అవసరమని పీహెచ్సీ వైద్యులు హరిప్రవీణ్ గాయత్రిలు అన్నారు. పిహెచ్సి ఆధ్వర్యంలో సోమవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, గర్భిణీలకు అధిక రక్తపోటు, కాళ్లు వాపులు వచ్చే అవకాశం ఉంటుందని అటువంటి సమయాల్లో తప్పనిసరిగా వైద్యాధికారుల దృష్టికి తీసుకురావాలన్నారు. ఈ కార్యక్రమంలో పిహెచ్ సి సిబ్బంది పాల్గొన్నారు.

**ఎస్.రాయవరం:**మండలంలో సర్వసిద్ధి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధి సైతార్‌పేట, సర్వసిద్ధి గ్రామాల్లో "వరల్డ్ ప్రీ ఎక్లాంప్షియా డే" పురస్కరించుకొని మెడికల్ ఆఫీసర్ డాక్టర్ ఎస్ ఎస్ వి శక్తి ప్రియ, వాసంతి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా శక్తి ప్రియ

అవగాహన కల్పిస్తున్న వైద్యులు

మాట్లాడుతూ, గర్భిణీల్లో ప్రీ ఎక్లాంప్షియ లక్షణాలు కనిపిస్తాయని, బిపి పెరగడం, అధిక ప్రోటీన్ కారణంగా సంభవిస్తుందన్నారు. సమయానికి మంచి ఆహారం తీసుకొని, నిద్ర పోవడంతో పాటు సంగీతం విని, ఒత్తిళ్లకు దూరంగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య విస్తరణ అధికారులు తంటపురెడ్డి నాగేశ్వరరావు, సత్యనారాయణ, మలేరియా ఇన్చార్జ నోడల్ ఆఫీసర్ పి ఎన్ వి ఎస్ ప్రసాద్ పాల్గొన్నారు.

## దళిత గృహిణికి న్యాయం చేయాలని...

# కెవిపిఎస్ నిరసన

ప్రజాశక్తి- కలెక్టరేట్: పెళ్లైన భార్య, పిల్లలు ఉండగా వారిని కాదని వేరొక మహిళతో సంబంధం పెట్టుకొని, భార్య పిల్లలను ఇంటి నుంచి గెంటేసిన భర్త, అతనికి సహకరిస్తున్న తల్లి పైన చర్య తీసుకోవాలని కెవిపిఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు వై.రాజు డిమాండ్ చేశారు. సోమవారం బాధిత మహిళ కు అండగా కలెక్టరేట్ ఎదుట కెవిపిఎస్ నిరసన తెలిపింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఈ అన్యాయాన్ని వన్ టౌన్ పోలీసులకు బాధిత దళిత మహిళ మాధవి లిఖిత పురంగా ఫిర్యాదు చేయడం జరిగిందన్నారు. పోలీసులు కేసు నమోదు చేయలేదని, ఆమెకు అన్యాయం చేసిన వారికి అండగా మాట్లాడుతున్నారని ఆరోపించారు. స్పందనలో ఫిర్యాదు చేశామన్నారు. బాధిత గృహిణి మాధవి మాట్లాడుతూ, వివాహ సమయంలో తమ తల్లిదండ్రులు ఇచ్చిన కట్న కానుకలు కాకుండా, అదనంగా 20 లక్షలు కట్నం తెమ్మని తన భర్త సంతోష్, తన అత్త కరీమా డిమాండ్ చేస్తున్నారని తెలిపారు. తనకు పుట్టిన పిల్లలు, తన భర్త వల్ల పుట్ట లేదని, మానసికంగా శారీరకంగా హింసిస్తున్నారని ఆరోపించింది. ఇప్పటికైనా తన భర్త, అత్తలపై కేసు నమోదు చేసి చట్టపరంగా చర్యలు తీసుకోవాలని ఆమె కోరారు.

ఆందోళన చేపడుతున్న బాధితులు, నేతలు

సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే

## పేదలకు ప్రభుత్వం అండ

- ఎమ్మెల్యే బాబూరావు

ప్రజాశక్తి-పాయకరావుపేట: మండలంలో మాసాపేట గ్రామంలో ప్రభుత్వం చేసిన సంక్షేమ పథకాలను గడపగడపకి మన ప్రభుత్వంలో భాగంగా ఎమ్మెల్యే గొల్ల బాబూరావు సోమవారం పర్యటించారు. ప్రతి గడప వద్దకు వెళ్లి అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందుతున్నాయా లేదా అని స్వయంగా అడిగి తెలుసుకున్నారు. ప్రజా సమస్యల పరిష్కారానికి గడప గడపకు కార్యక్రమం ప్రారంభించామన్నారు. పేద ప్రజలందరికీ వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటుందని వివరించారు. బడుగు, బలహీన వర్గాలకు, పేద ప్రజలకు న్యాయం చేయడానికి ప్రభుత్వం అనేక పథకాలు ప్రవేశ పెడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ గెడ్డమూరి శ్రీనివాస్, జిల్లా వ్యవసాయ శాఖ సలహా మండలి చైర్మన్, ఉత్తరాంధ్ర ఎన్నికల పరిశీలకులు చిక్కాల రామారావు, జడ్పిటిసి లంక సూరిబాబు, ప్రచార పబ్లిక్ వింగ్ అధ్యక్షులు దగ్గుపల్లి సాయిబాబా, ఉప సర్పంచ్ జగత శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

# రెజ్లర్ల పోరాటానికి ఉపాధ్యాయుల మద్దతు

ప్రజాశక్తి-కలెక్టరేట్: ఢిల్లీలో మహిళ రెజ్లర్లు చేపట్టిన పోరాటానికి డిటిఎఫ్ ఉపాధ్యాయ సంఘం మద్దతు తెలిపింది. సోమవారం జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా డిటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి జి.మధు, జిల్లా కన్వీనర్ ఎ.ధర్మేందర్ రెడ్డి, సంధ్యారాణి మాట్లాడుతూ ప్రపంచ స్థాయిలో మన దేశానికి కీర్తి ప్రతిష్టలు తీసుకొచ్చిన మహిళ రెజ్లర్లపై లైంగిక వేధింపులకు పాల్పడిన బిజెపి ఎంపి బ్రిజ్ భూషణ్ ని తక్షణం అరెస్ట్ చేయాలని, అతనిని పదవి నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. సిలబస్ నుండి శాస్త్రీయ, చారిత్రక అంశాలను తొలగించడానికి వారు తీవ్రంగా వ్యతిరేకించారు. పాఠశాల విద్యాశాఖ ఉన్నత అధికారుల నియంతృత్వ పోకడలను నిరసించారు. పాఠశాల విద్యాశాఖను నాన్ వెకేషన్ డిపార్ట్మెంట్గా ప్రకటించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సాయి ప్రసాద్, నానాజీ, రామారావు, బుజ్జి, శివప్రసాద్, అంబేద్కర్, రాజేశ్వరి, ఉషారాణి, సంతోషి, కుమారి, జయ తదితరులు పాల్గొన్నారు. ఎఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి జి పణీంద్ర, పిడిఎస్ఒ నాయకుడు భాస్కర్, తదితరులు మద్దతు తెలిపారు.

నివాళి అర్పిస్తున్న గ్రంథాలయాధికారి

## రాజా రామ్మోహన్‌రాయ్ జయంతి

ప్రజాశక్తి-నర్సీపట్నంటౌన్: స్థానిక శాఖ గ్రంథాలయంలో రాజా రామ్మోహన్‌రాయ్ జయంతి వేడుకలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ అధికారిణి పి దమయంతి రాజా రామ్ మోహన్ రాయ్ చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, రాజా రామ్ మోహన్ రాయ్ ఫౌండేషన్ కలకత్తా నగరంలో వుందని, దేశవ్యాప్తంగా వున్న గ్రంథాలయాలకు ఈ సంస్థ నుండే సహాయ సహకారాలు అందిస్తుంటారని తెలిపారు. ముఖ్యంగా పుస్తకాలు, ఫర్నిచర్, కంప్యూటర్, టీవీ వంటి పరికరాలను అందిస్తున్నారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు కనకరాజు పాల్గొన్నారు.

పరవాడ: మండలంలోని దేశపాత్రునిపాలెం గ్రామంలో ఐద్వా అనకాపల్లి జిల్లా అధ్యక్షురాలు పి.మాణిక్యం అధ్వర్యంలో బాలల సంఘం ద్వారా సోమవారం రాజారామ్మోహన్ రాయ్ జయంతిని ఘనంగా నిర్వహించారు. పిల్లలతో రాజారామ్మోహన్ రాయ్ చిత్రాన్ని గీయించి, దానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఎం యజ్ఞేశ్ కుమార్, కె.అభిరాము నాయుడు గీసిన రాజారామ్మోహన్‌రాయ్ చిత్రాలు అలరించాయి.

## 781వ రోజుకు దీక్షలు

ప్రజాశక్తి- కలెక్టరేట్: స్టీల్ ప్లాంట్ ఇతర ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద కార్మిక ప్రజాసంఘాల ఆధ్వర్యంలో చేపట్టిన దీక్షలు సోమవారం నాటికి 781 వ రోజుకు చేరాయి. దీక్షల్లో సిఐటియుఐ మత్స్యకార మహిళలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.కనకారావు మాట్లాడుతూ, స్టీల్ ప్లాంట్ ప్రజల ఆస్తి అని, దీనిని అమ్మివేసే అధికారం మోడీకి ఎక్కడదని ప్రశ్నించారు. ఈ దీక్షల్లో యూనియన్ ఆర్గనైజింగ్ కార్యదర్శి కె.లక్ష్మి, ఎం.లక్ష్మిదివ్య, అనూష, దుర్గ, రఘు, ప్రొఫెసర్ ఎస్.సూరప్పడు పాల్గొన్నారు .

స్వాధీనం చేసుకున్న కలప

## అక్రమ కలప స్వాధీనం

ప్రజాశక్తి-గొలుగొండ: అక్రమంగా తరలించేందుకు రహస్య ప్రదేశంలో దాచి ఉంచిన టేకు దుంగలను సోమవారం గొలుగొండ అటవీ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. హైదరాబాద్ కు చెందిన ఓ వ్యక్తికి గొలుగొండ మండలం దారమటం సమీపంలోని పాత మల్లంపేట రెవిన్యూ పరిధిలో సుమారు 60 ఎకరాలలో టేకు తోటలు ఉన్నాయి. ఈ టేకు తోటలలో నాలుగు రోజుల క్రితం కొంతమంది వ్యక్తులు టేకు చెట్లను నరికించి తరలించడానికి దాచారు. సమయం చూసుకొని వీటిని పట్టణ ప్రాంతాలకు తరలించేందుకు వీలుగా రహస్య ప్రదేశానికి తరలించారు. ఈ విషయమై బాధితులు అటవీ అధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో అటవీశాఖ అధికారులు సోమవారం ఉదయం అక్రమంగా దాచి ఉంచిన టేకు దొంగలను స్వాధీనం చేసుకుని గొలుగొండకు తరలించారు. పట్టుకున్న కలప విలువను అంచనా చేస్తున్నామని అటవీసెక్షన్ అధికారి లక్ష్మణ్ తెలిపారు.

# రోడ్డు నిర్మాణానికి వినతి

ప్రజాశక్తి-కోటవురట్ల: మండలంలో గొట్టువాడ శివారు అరకు గిరిజన గ్రామానికి రహదారి సౌకర్యం కల్పించాలని సోమవారం ఆ గ్రామానికి చెందిన గిరిజనులు ఎంపిడీవో చంద్రశేఖర్‌కు వినతిపత్రం అందజేశారు. గ్రామానికి వెళ్లే రహదారి పూర్తిగా ఛిద్రమైందని, దీంతో ప్రజలు నానా అవస్థలు పడుతున్నారని తెలిపారు. ఇటీవల గ్రామానికి చెందిన గర్భిణీకి సకాలంలో వైద్య పరీక్షలు అందక మరణించిన విషయాన్ని పేర్కొన్నారు. ఈ మార్గంలో కనీసం కాలినడకన వెళ్లేందుకు కూడా అవకాశం లేకుండా ఉందని, అధికారులు తక్షణమే స్పందించి గ్రామానికి రహదారి నిర్మాణం చేపట్టాలని కోరారు.



వినతిపత్రం ఇస్తున్న గిరిజనులు

# 'నేను స్టూడెంట్ సర్' చిత్ర యూనిట్ సందడి

ప్రజాశక్తి-కలెక్టరేట్: నేను స్టూడెంట్ సర్ చిత్రం యూనిట్ సోమవారం నగరంలో సందడి చేసింది. ఈ సందర్భంగా దసపల్లా హోటల్లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో చిత్రం హీరో బెల్లంకొండ గణేష్ మాట్లాడుతూ ఈ సినిమా అన్ని తరగతుల ప్రేక్షకులను అలరిస్తుందన్నారు. హాయిగా సాగిపోతున్న ఒక విద్యార్థి ప్రేమ కథ నేపథ్యంలో ఎదురైయిన సమస్యను ఎలా అధిగమించాడు అన్నదే చిత్ర కథాంశం అన్నారు.విశాఖ అంటే ఎంతో ఇష్టం అన్నారు.విశాఖలో నిన్న ట్రైలర్ విడుదల చేశామని మంచి స్పందన వచ్చిందన్నారు. తన మొదటి సినిమా స్వాతి ముత్యం మంచి సినిమాగా పేరు వచ్చిందన్నారు.నిర్మాత సతీష్ వర్మ మాట్లాడుతూ ఎస్ వీ 2 ఎంటర్ టైన్మెంట్ పతాకంపై నిర్మించిన ఈ చిత్రం జూన్ 2 న విడుదల అవుతుందని తెలిపారు.ఈ సినిమాలో విలన్ ఎవరు అన్నది చివరి వరకు తెలియదన్నారు. దర్శకుడు రాకేష్ ఉప్పలపాటి మాట్లాడుతూ తాను దర్శకుడు తేజ వద్ద సహాయ దర్శకుడుగా పని చేశానని తెలిపారు. హిందీ హీరోయిన్ భాగ్య శ్రీ కుమార్తె అవంతిక దాసిని హీరోయిన్ గా పరిచయం అవుతుందన్నారు. మీడియా సమావేశం లో చిత్ర నటులు రియా, స్వామి,కార్తీక్ పాల్గొన్నారు.

నివాళి అర్పిస్తున్న ఉప ముఖ్యమంత్రి

## మాజీ సర్పంచ్‌కు నివాళి

ప్రజాశక్తి-మాడుగుల: మాజీ సర్పంచ్ వేమవరపు వెంకటరమణకు ఉపముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు సోమవారం నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఉపముఖ్యమంత్రి మాట్లాడుతూ, పంచాయతీ అభివృద్ధికి వెంకటరమణ ఎంతో కృషి చేశారని కొనియాడారు. స్వచ్ఛమైన రాజకీయ నాయకుడిగా పేరు పొందారని, ఆయన లేని లోటు తీర్చలేనిదని అన్నారు. ఈ కార్యక్రమంలో కురచ నరసింగరావు, మాజీ సర్పంచ్ కుమారుడు, ఎంపిపి పెదబాబు, వివిధ మండలాలకు చెందిన వివిధ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

హాజరైన సిబ్బంది

## బూత్ లెవెల్ సిబ్బందితో సమావేశం

ప్రజాశక్తి -కోటవురట్ల: తహసిల్దార్ కార్యాలయంలో సోమవారం బూత్ లెవెల్ అధికారులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా తహసిల్దార్ జానికమ్మ మాట్లాడుతూ, గ్రామీణ ప్రాంతాల్లో ఓటర్ల చేర్పులు, తొలగింపులు, సవరణ పట్ల ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ప్రతి ఓటర్‌ను ఆధార్కు అనుసంధానం చేయాలని సూచించారు. బూతు లెవెల్లో సమస్యలు ఏమైనా ఉంటే ఎన్నికల అధికారుల దృష్టికి తీసుకువెళ్లాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎలక్షన్ డిటి తాతాచార్యులు, మండల ఎన్నికల అధికారి వెంకటలక్ష్మి, బూత్ లెవెల్ అధికారులు పాల్గొన్నారు.

# సరుగుడు తోట దగ్ధం

ప్రజాశక్తి-గొలుగొండ: మండలంలో పాత జోగంపేట నుండి సాలిక మల్లవరం, పొగచెట్లపాలెం, వెంకటాపురం గ్రామాలకు వెళ్లే విద్యుత్ లైన్లు ఐదు అడుగుల కంటే కిందికి వేలాడటంతో సరుగుడు తోట దగ్ధమైంది. సాలిక మల్లవరం గ్రామానికి చెందిన పెదిరెడ్ల మల్లేశ్వరరావు సరుగుడు తోట సుమారు ఎకరం కాలి బూడిదయింది. తెల్లవారుజామున వీచిన గాలికి విద్యుత్ మంటలు రావడంతో ఈ సంఘటన జరిగిందని చుట్టుపక్కల రైతులు వాపోతున్నారు. కాగా ఈ విషయమై గొలుగొండ విద్యుత్ అధికారులకు, లైన్మెన్లకు, డివిజన్ అధికారులకు ఎన్నిసార్లు చెప్పినా వేలాడుతున్న విద్యుత్ వైర్లపై పట్టించుకోలేదని స్థానికులు వాపోయారు. ఈ చుట్టుపక్కల వ్యవసాయం చేసే వారంతా భయం గుప్పెట్లో వ్యవసాయం చేయవలసి వస్తుందని, ఎప్పుడు ఏమవుతుందో తెలియక ఆందోళన చెందుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యుత్ అధికారులు పట్టించుకోకపోవడంతో సుమారు రెండు లక్షల వరకు నష్టపోవాల్సి వచ్చిందని రైతు గుగ్గోలు పెట్టాడు. జీడి మామిడి తోటలగుండా వెళ్లే కూలీలు, రైతులు, కరెంటు తీగలకు భయపడి పిక్కలు ఏరలేక తీవ్రంగా నష్టపోతున్నామని తెలిపారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి విద్యుత్ తీగలను సరి చేయాలని స్థానికులు కోరారు.

దగ్ధమైన తోటను పరిశీలిస్తున్న బాధితుడు

## నేటి నుంచి ఆధార్ క్యాంపు

ప్రజాశక్తి -కోటవురట్ల: ఈనెల 23 నుంచి 31 వరకు జరిగే మొబైల్, ఆధార్ క్యాంపులను సద్వినియోగం చేసుకోవాలని ఎంపిడీవో చంద్రశేఖర్ తెలిపారు. సుంకపూర్, పాములవాక, ఎండపల్లి, తంగేడు, రామచంద్రపాలెం, చిన్నబొడ్డేపల్లి, గ్రామాలలో జరిగే క్యాంపులలో ఆయా ప్రాంతానికి సంబంధించిన ప్రజలు ఆధార్‌ను అప్డేట్ చేసుకోవాలని ఆయన సూచించారు.